ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -126 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 23 ఆగస్టు 2026


# ఇంటింటా నెట్ జీరో



## అలవరం కోడూరులో సీఎం చంద్రబాబు పర్యటన

**పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి**

**వంటగది వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారాలు**

**సౌర విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్ వినియోగం ద్వారా గ్యాస్, కరెంట్ ఆదా**



**విశాఖపట్నం,ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
పర్యావరణ పరిరక్షణను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఇంటింటి ఉద్యమంగా మార్చి, గ్రామాలను స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు 'నెట్‌జీరో' విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించి, పర్యావరణహిత జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని

మిగతా 2లో.



# 10,060 ఉద్యోగాలు

**విడుదలైన ఏపీ జాబ్ క్యాలెండర్ -4 దశల్లో 10,060 ఉద్యోగాలు**

**సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వరుసగా నోటిఫికేషన్లు**

**అమరావతి ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన "జాబ్ క్యాలెండర్–2026"ను విడుదల చేసింది.

మిగతా 2లో.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం

కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం

యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష

'వందేమాతరం'పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

2లో.




# విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

**విద్యావ్యవస్థలోని సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ వినూత్న ప్రయత్నం**

**విద్యార్థులతో విద్యార్థిలా, ఉపాధ్యాయులతో ఉపాధ్యాయుడిలా మమేకం**

**విశాఖలో ఆధునికీకరించిన పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా ముచ్చట**

**విజయనగరంలో ఉపాధ్యాయులతో కలిసి కెమిస్ట్రీ క్లాస్‌లో కూర్చున్న వైనం**

**లోకేశ్ ఆచరణాత్మక శైలిపై విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి హర్షం**

2లో.



# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

**ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీ**

**బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సులో చంద్రబాబు**




**విశాఖపట్నం,ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీగా విశాఖపట్నం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ దేశాల యువజన, క్రీడ శాఖల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమం 2026కు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు సీఎం స్వాగతం పలికారు. భారత తూర్పు తీరంలో విశాఖ దేశానికే ఆభరణమని అభివర్ణించారు.

మిగతా 2లో.

# కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

**గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం**

**ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి**

**అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు**

**క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు**



**హైదరాబాద్‌ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా 2లో.

# విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

**కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్‌ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
అత్యున్నత విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందాన్ని కోరారు. దీనికోసం విద్యారంగంలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా పాల్గొన్నారు.



మిగతా 2లో.



# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

**తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం**

**దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం**

**ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్**

**హైదరాబాద్‌ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది.

మిగతా 2లో.

# 10,060 ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆగస్టు 22, 2026న జీవో నెం.81ను జారీ చేశారు. ఈ నియామక ప్రక్రియను నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ, ఏపీఎస్ఎల్పీఆర్బీ (పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు), డీఎస్సీ వంటి నియామక సంస్థల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "స్వర్ణాంధ్రప్రదేశ్2047" లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

ఇప్పటికే తొలి దశ నోటిఫికేషన్ జారీ కాగా, మిగతా మూడు దశల వివరాలు ఇవిగో!

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్: 2026 సెప్టెంబర్ 15)

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్–1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్–1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

గ్రూప్–1 సర్వీసులు (149 పోస్టులు): డిప్యూటీ కలెక్టర్: 11 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ): 36 అసిస్టెంట్ కమిషనర్ (ఎస్టీ): 14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–××: 12 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 35 డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ): 10

ఇతర కీలక పోస్టులు (3,082): పోలీస్ శాఖ: సివిల్ ఎస్సై (182), ఏఆర్ ఎస్సై (116), సివిల్ కానిస్టేబుల్స్ (542), ఏఆర్ కానిస్టేబుల్స్ (205), కమ్యూనికేషన్ కానిస్టేబుల్స్ (200), ఏపీఎస్పీ ఎస్సై (71), ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (80) సహా మొత్తం 1,500కు పైగా పోస్టులున్నాయి. ఇతర శాఖలు: వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (164), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (196), ఫైర్‌మెన్ (158), జైలు వార్డర్లు (171), హార్టికల్చర్ ఆఫీసర్ (45), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్–××× (దేవాదాయ శాఖ) (104).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ దశలో గ్రూప్–2, ఇంజనీరింగ్, ప్రొహిబిషన్ శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్–2 సర్వీసులు (673 పోస్టులు): డిప్యూటీ తహశీల్దార్: 200 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 176 గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్టీఓ): 40 ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సబ్–ఇన్‌స్పెక్టర్: 25 సబ్–రిజిస్ట్రార్ గ్రేడ్–××: 7 సచివాలయం, హెచ్ఓడీలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, అకౌంటెంట్లు.

ఇంజనీరింగ్, ఇతర పోస్టులు (1,638): అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ): ఇరిగేషన్ (224), పంచాయతీరాజ్ (100), గ్రామీణ నీటి సరఫరా (73), ఆర్&బీ (75) సహా పలు శాఖల్లో మొత్తం 428 పోస్టులు.

విద్యుత్ సంస్థల్లో ఏఈఈలు: ఏపీ ట్రాన్స్‌కో (200), ఏపీ జెన్‌కో (100), డిస్కంలు (మొత్తం 329) కలిపి 629 పోస్టులు.

ఇతరాలు: ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కానిస్టేబుల్ (400), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (50).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ విడత దాదాపు పూర్తిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి (మెగా డీఎస్సీ) కేటాయించారు.

పాఠశాల విద్యా శాఖ (2,991 పోస్టులు): సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌స్ట్రక్టర్లు, డీఈవో పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను సంబంధిత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు.

వయోజన విద్య: అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 4 ఉన్నాయి.

ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సంబంధిత శాఖలు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని నియామక సంస్థలకు అందించాలని ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రిజర్వేషన్ పాలసీ, సర్వీస్ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీస్థాయి నియామక ప్రకటనతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి..

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

**ఢిల్లీ ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి.




ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు.అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

**'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం**

ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

# విద్యార్థుల్లో విద్యార్థిగా..
# టీచర్లలో టీచర్ గా..!




**విశాఖపట్నం,ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**

విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న వినూత్న పంథా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ పర్యటనలకు భిన్నంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఆయన నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమవుతున్నారు. వారిలో ఒకరిగా కలిసిపోయి, సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారాలకు చొరవ చూపుతున్నారు. "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" రూపకల్పనే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం విద్యావర్గాల్లో కొత్త ఆశలు రేపుతోంది.

విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు క్రీడా మైదానం మోకాలి లోతు నీటిలో ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని, దివీస్ యాజమాన్యంతో



మాట్లాడి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలను అభివృద్ధి చేసేలా ఒప్పించారు. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆధునాతన ప్లేగ్రౌండ్‌ను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మైక్ అందించి వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. వారు అడిగిన సరదా ప్రశ్నలకు అంతే ఉత్సాహంగా సమాధానాలిచ్చి వారిలో ఒకరిగా కలిసిపోయారు.

అనంతరం విజయనగరం పర్యటనలోనూ లోకేశ్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దాసన్నపేట బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ ఉపాధ్యాయులకు కెమిస్ట్రీపై పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, వారికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వెళ్లి ఉపాధ్యాయుల మధ్య కూర్చున్నారు. శ్రద్ధగా పాఠం వింటూనే, విరామ సమయంలో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణమే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించారు.

మంత్రి హోదాను పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు లోకేశ్ అనుసరిస్తున్న ఈ ఆచరణాత్మక విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యల పరిష్కారం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

**మొదటిపేజీ తరువాయి**

సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖను పిలుస్తారని బ్రిక్స్ దేశాల మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో విశాఖ నగరం అగ్రస్థానంలో ఉందని ఉద్ఘాటించారు. మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ – ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖను తీర్చి దిద్దుతున్నట్లు వ్యాఖ్యానించారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి విశాఖలో అపార అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యువత ఆకాంక్షలకు ప్రతీకగా విశాఖ నగరాన్ని తీర్చి దిద్దుతున్నట్లు పేర్కొన్నారు. భాష, సంస్కృతి, భౌగోళికంగా భిన్నమైనా.. క్రీడలతో బ్రిక్స్ దేశాల ఐక్యత ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. క్రీడలు పోటీ మాత్రమే కాదని... సంస్కృతి, జీవన విధానమని తెలిపారు. యువతలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం వంటివి భారతీయ విధానమని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన పౌరులతోనే బలమైన సమాజం ఉంటుందని వివరించారు. క్రీడలతో అ÷–లథెట్లు, కోచ్‌లు, ట్రైనర్లకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ టూరిజంతో పెట్టుబడులు, అంతర్జాతీయ ఈవెంట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో స్టేట్ అకాడమీలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో సమగ్ర క్రీడా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ వస్తుందని స్పష్టం చేశారు. నెల్లూరు కేంద్రంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, అపెరల్, టెక్నాలజీ తయారీ కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్ల నిర్వహణెళి లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధమని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని వెల్లడించారు. బ్రిక్స్ దేశాల మధ్య అ÷–లథెట్లు, కోచ్‌ల పరస్పర మార్పిడికి అవకాశం ఉందని చెప్పారు. వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. నైపుణ్యం కలిగిన యువత, సాంకేతిక వ్యవస్థ, సుదీర్ఘ తీరప్రాంతం ఏపీ బలమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఇంటింటా నెట్ జీరో

**మొదటిపేజీ తరువాయి**

ఆయన స్పష్టం చేశారు. శనివారం 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరు గ్రామంలో సీఎం పర్యటించారు.

ఈ సందర్భంగా, గ్రామంలో అమలు చేస్తున్న నెట్‌జీరో కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, మురుగునీటిని ఇంటి వద్దే శుద్ధి చేయడం వంటి పద్ధతుల ద్వారా గ్రామాలను ఎలా ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారో తెలిపారు.

**క్షేత్రస్థాయిలో కార్యక్రమాల పరిశీలన**

కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు, గ్రామానికి చెందిన జె. మహేశ్వరరావు ఇంటిని సందర్శించారు. మహేశ్వరరావు కుటుంబం చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వంటింటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్ట్ గుంతలో వేసి సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని వారు ముఖ్యమంత్రికి చూపించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, వ్యర్థాల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని వివరించారు. అలాగే, ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని బయటకు వదలకుండా, ఆవరణలోనే నిర్మించిన ఇంకుడు గుంతలోకి మళ్లిస్తున్న విధానాన్ని సీఎం పరిశీలించారు. ఈ 'ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్' వల్ల రోడ్లపై మురుగు నిలవకుండా, దోమల బెడద తగ్గి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని లబ్ధిదారులు తెలిపారు. ప్రభుత్వం 'దీపం' పథకం కింద సిలిండర్లు అందిస్తున్నప్పటికీ, ఇండక్షన్ స్టవ్ వాడకం ద్వారా గ్యాస్‌పై ఆధారాపడటాన్ని తగ్గించుకుంటున్నామన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ద్వారా వచ్చే విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్ నడుపుతుండటంతో కరెంట్ బిల్లు కూడా ఆదా అవుతోందని వివరించారు.ఈ ఆదర్శ విధానాలను పాటిస్తున్న మహేశ్వరరావు కుటుంబాన్ని ముఖ్యమంత్రి అభినందించి, వారితో సెల్ఫీ దిగారు. అలవరం కోడూరులో అమలవుతున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు విస్తరింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# కూలిన భవనం..ఇద్దరి దుర్మరణం

**మొదటిపేజీ తరువాయి**

మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

# విద్యా,పరిశోధనలకుకేంబ్రిడ్జ్ సహకారం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట, 'ఫ్రూగల్ ఏఐ' కో–చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్ర మాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొనేందుకు వారు అంగీకరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూరుస్తున్నదని చెప్పారు.

సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధుల భేటీ

లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి చూపారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శిస్తామని తెలిపింది.

# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

**మొదటిపేజీ తరువాయి**

ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది.

ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు.ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బ్రేక్.. కేంద్రంపై ఖర్గే ఫైర్

**ఢిల్లీ ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సాగాల్సిన ఈ పర్యటనను కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖర్గే, విదేశీ పర్యటనల ద్వారా ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలకు పెట్టుబడులను ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. "అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నారు. రాష్ట్రాల్లో పరిశ్రమల స్థాపనకు వారిని ఆహ్వానించేందుకే ముఖ్యమంత్రులు ఇటువంటి పర్యటనలు చేపడుతుంటారు. అలాంటి కీలక పర్యటనకు అనుమతి నిరాకరించడం అన్యాయం" అని ఆయన మండిపడ్డారు.

"కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తోంది, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విషయంలో మాత్రం వివక్ష చూపుతోంది" అని మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. విదేశీ పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రాలకు లభించే పెట్టుబడులు అంతిమంగా దేశాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి కీలక పర్యటనలను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ ప్రగతికి విఘాతం కలిగించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదని మల్లికార్జున ఖర్గే హితవు పలికారు.

# మెగాస్టార్ చిరంజీవి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన

## సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు

**పాములపాడు ఆగస్టు-22 రిపబ్లిక్ న్యూస్:-**

పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మెగాస్టార్ చిరంజీవి కి ప్రత్యేక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సింగపూర్ దేశంలో అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తన అభిమానులు, స్నేహితులు మధ్య భారీ కేకును కట్ చేసి, ఒకరికి ఒకరు తినిపించుకొని సంతోషంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న నరసాపురంలో 1955వ సంవత్సరంలో, ఆగస్టు-22వ తేదీన జన్మించిన చిరంజీవి జన్మించారన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో నాలుగు దశాబ్దాలకు పైగా తనదైన శైలితో భారతీయుల హృదయాలలో ప్రత్యేక ముద్ర వేశారన్నారు.








**చిరంజీవి సినీ ప్రస్థానంలో రికార్డు బద్దలు కొట్టిన సినిమాలు**

1978 ప్రాణం ఖరీదు: నటుడిగా ప్రారంభమైన తొలి దశ, 1983 ఖైదీ: చిరంజీవి స్టార్‌డమ్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లిన చిత్రం, 1987 స్వయంకృషి: నటుడిగా ఆయనలోని వైవిధ్యాన్ని చాటిన చిత్రం, 1988 రుద్రవీణ: సామాజిక సందేశంతో గుర్తుండిపోయిన చిత్రంగా జాతీయ సమైక్యతకు సంబంధించిన నర్గిస్ దత్ అవార్డును అందుకుందన్నారు.

1990 జగదేకవీరుడు అతిలోకసుందరి, 1991 గ్యాంగ్ లీడర్, 1992 ఘరానా మొగుడు, 2002 ఇంద్ర, 2003 ఠాగూర్, 2004 శంకర్ దాదా ఎంబీబీఎస్, 2006 స్టాలిన్, 2017 ఖైదీ నంబర్ 150, దాదాపు దశాబ్దం తర్వాత ఆయన ఘనమైన రీఎంట్రీ 2019 సైరా నరసింహారెడ్డి, 2022 ఆచార్య, గాడ్‌ఫాదర్, 2023 వాల్తేరు వీరయ్య, భోళా శంకర్ వంటి చిరంజీవి కెరీర్‌లో 150కి పైగా సినిమాలు ఉన్నాయన్నారు. 2024లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఆయనను భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రోలిఫిక్ ఫిల్మ్ స్టార్-యాక్టర్/డాన్సర్ గా గుర్తించిందన్నారు. 143 చిత్రాల్లో నటించడం, 537 పాటల్లో డ్యాన్స్ చేయడం ఈ రికార్డుకు ప్రాతిపదికగా నిలిచారన్నారు.

**ఆయన సేవలను గుర్తించిన ఆయా కేంద్ర ప్రభుత్వాలు**

చిరంజీవి కి 2006లో పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ జాతీయ అవార్డులు లభించాయన్నారు. సినిమాలతో పాటు, సమాజ సేవా కార్యక్రమాల్లోనూ ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. 1998లో ప్రారంభించిన చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రక్తదానం, నేత్రదానం వంటి అనేక సమాజసేవ కార్యక్రమాలను ప్రోత్సహించిందన్నారు.

సినిమా రంగంలోకి ఎందరో వస్తారనీ, కానీ తరతరాల అభిమానాన్ని సంపాదించేవారు కొందరే ఉంటారని అన్నారు.

సినిమా ఇండస్ట్రీలో నటుడిగా అడుగుపెట్టి స్టార్‌గా ఎదిగి, మెగాస్టార్‌గా కోట్లాది హృదయాల్లో స్థానం సంపాదించిన మహానటుడు చిరంజీవి అన్నారు.

కష్టం నుంచి కృషి, పట్టుదలతో గొప్ప గొప్ప శిఖరాలకు ఎదగవచ్చని తన జీవితంతో నిరూపించిన వ్యక్తి చిరంజీవి అన్నారు.నటనలో, వైవిధ్యంలో, నృత్యంలో, ఉత్సాహం కలిగిన వ్యక్తిత్వం ఉన్న నటుడు అన్నారు.

సామాజిక సేవలో మానవత్వం,అభిమానుల పట్ల ప్రేమ, ఆప్యాయత, ఇవన్నీ కలిపిన అరుదైన వ్యక్తిత్వం వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని అన్నారు.

సినిమా హీరో చిరంజీవి పుట్టినరోజు అంటే ఒక నటుడి జన్మదినం మాత్రమే కాదు, తెలుగు సినీ చరిత్రలో ఒక అద్భుతమైన శకాన్ని గుర్తుచేసుకునే రోజు అని అన్నారు.

మెగాస్టార్ చిరంజీవి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.

ఆయురారోగ్యాలతో, ఆనందాలతో, మరెన్నో విజయాలతో చిరంజీవిగా వర్ధిల్లాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు కోరుకుందాం అని పిలుపునిచ్చారు.

# ఘనంగా పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

## చిరంజీవి సేవ కార్యక్రమాలే అందరికీ స్ఫూర్తి : పసుల నరేంద్ర యాదవ్.







**ఆళ్లగడ్డ ఆగష్టు 22 రిపబ్లిక్ న్యూస్**

ఆళ్లగడ్డ లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తన అద్భుతమైన నటనతో తెలుగు సినీ ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన, కేంద్ర మాజీ మంత్రి, పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆళ్ళగడ్డ నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షులు పసుల నరేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుండి మొక్కలు నాటే కార్యక్రమం, గవర్నమెంట్ హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ, ఈరోజు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేయించి, స్ఫూర్తి మదర్ హోమ్ అనాధ ఆశ్రమంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి వారి సమక్షంలోనే కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఆళ్లగడ్డ నియోజకవర్గం మెగా అభిమానులు, ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగాజనసేన పార్టీ ఆళ్లగడ్డ తాలూకా సమన్వియ కర్త మైలేరి మల్లయ్య పాల్గొన్నారు.అనంతరం మెగా అభిమానులు మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టలను, ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్ గా నిలిచారనీ. రక్తనిధి, నేత్ర నిధి ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుని సమాజం పట్ల తన కున్న బాధ్యతను నెరవేరుస్తున్నారనీ. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, సినీ ప్రేక్షకులను మరింతగా అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షునిగా పశువుల నరేంద్ర యాదవ్ ను నియమించినందుకు చిరంజీవి కీ మైలేరు మల్లయ్య ధన్యవాదాలు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు షేక్ జమాల్ బాషా, వేముల కోటి, రాచంశెట్టి చిన్న పెద్దయ్య, తులసి, కేశవ, గుర్రప్ప, దేవా ఆంజనేయులు, కొండపేట వీరయ్య, వెంకటసుబ్బయ్య, మెగా చైతన్య, కోరే వేణుగోపాల్, వెంకటరాముడు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ

**అధునాతన ట్రాఫిక్ అవగాహన వాహనాన్ని ప్రారంభించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి.. రాంగ్ రూట్, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**

రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కర్నూలు జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డిజిటల్ స్క్రీన్‌తో కూడిన అధునాతన ట్రాఫిక్ అవగాహన వాహనాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ కొండారెడ్డి బురుజు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కర్నూలు నగర ప్రజలు, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై మరింత అవగాహన పెంచేందుకు ఈ ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ స్క్రీన్‌పై ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతకు సంబంధించిన అవగాహన వీడియోలను ప్రదర్శిస్తామని చెప్పారు.

హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి కారణాలతో జరిగే రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను కూడా ప్రదర్శిస్తామని ఎస్పీ తెలిపారు. ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ, ఆస్తి నష్టాలను ప్రజలకు తెలియజేసి, వారిలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.






ఈ అవగాహన వాహనాన్ని కర్నూలు నగరంలోని ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా రద్దీ ప్రాంతాలను గుర్తించి, వివిధ ప్రదేశాల్లో వివిధ సమయాల్లో నిర్వహిస్తామని చెప్పారు. తద్వారా ఎక్కువ మంది ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడానికే పరిమితం కాకుండా.. ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎస్పీ వివరించారు.

ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని నియంత్రించేందుకు ప్రజల్లో ప్రవర్తనా మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు నగరంలో అవసరమైన ప్రాంతాల్లో డివైడర్లు, వన్‌వేలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి సురక్షితంగా వాహనాలు నడపాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

అనంతరం సామాజిక బాధ్యతతో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్డోన గ్రామంలో మహిళా రక్షక్ అవగాహన కార్యక్రమం

## సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ సి. వెంకట నరసింహులు

**చిప్పగిరి, ఆగస్టు, 22,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం బెల్డోన గ్రామం నందు శనివారం మహిళా రక్షక్ అవగాహన కార్యక్రమం సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్సై సి వెంకట నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు, సైబర్ మోసాలపై నివారణ, మహిళల భద్రత, ఐవియర్ ఫ్రాడ్ కాల్స్, రహదారి భద్రతా నియమాలు, బాల్యవివాహాల నివారణ ,మరియు ఆన్లైన్ మోసం తక్షణమే నివేదించడానికి 1930, సైబర్ క్రైమ్, హెల్ప్ లైన్ నెంబర్ ను ఉపయోగించడం వంటి అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.






# ఎస్ఐఆర్-2026లో భాగంగా ఆగస్టు-22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు

**18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోండి:-జి.సుభద్రమ్మ (తహసిల్దార్)**



**పాములపాడు ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్:-**భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) మార్గదర్శకాల మేరకు, 01.07.2026ను అర్హత తేదీగా నిర్ణయించి రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్-2026)లో భాగంగా, 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతున్న నేపథ్యంలో, ఆగస్టు-22, 23, 29 మరియు 30 తేదీలలో (శనివారాలు, ఆదివారాలు) పాములపాడు మండలంలోని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు ఏఈఆర్ఓ/ తహసిల్దార్ జి.సుభద్రమ్మ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జి.సుభద్రమ్మ మాట్లాడుతూ ప్రత్యేక ప్రచార దినాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారి (బి ఎల్ ఓ) ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. బిఎల్ఓ లు తమ వద్ద ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8, ఫారం-8ఏ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా మరియు ఏఎస్ డిడి జాబితా తదితర వివరాలతో పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని అందిస్తారనీ అన్నారు.డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేరు లేని, అర్హత కలిగిన వ్యక్తులు ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో ఫారం-6 ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చు అని అన్నారు. అలాగే, ఓటర్ల జాబితాలో పేర్లు / వివరాలకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నవారు ఫారం-7 ద్వారా, వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైన వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువ ఓటర్లు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని సూచించారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ( సర్) ప్రక్రియలో నోటీసుల పంపిణీ ప్రక్రియ 100 శాతశీ పూర్తి కావాలి

## : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 22 (రిపబ్లిక్ న్యూస్ ):**




జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ( సర్-2026) ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ 100 శాతం పూర్తి కావాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు.శనివారం నియోజకవర్గాల ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లతో నోటీసులు జారీ పంపిణీ, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు తదితరు అంశాలపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ( సర్-2026) ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ 100 శాతం పూర్తి కావాలనీ తెలిపారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 80,283 నోటీసులు జనరేట్ చేయగా, 73,789 నోటీసులు డెలివరీ అయ్యాయి. ఇంకా 6,494 నోటీసులు పంపిణీకి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నోటీసుల పై నిర్వహించిన విచారణలో ఇప్పటివరకు 19,490 విచారణలు పూర్తయ్యానీ అన్నారు. అనంతరం సంబంధిత వివరాలను పరిశీలించి ఓటరు జాబితా తుది ప్రచురణకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఫారం-6,7,8 కు సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అవసరమైన సవరణలు, మార్పులు, ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఓటర్లకు సంబంధించిన ప్రతి దరఖాస్తు నోటీసు విచారణ వివరాలను పారదర్శకంగా నమోదు చేసి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ- 2026 ను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు.

# ప్రతి ఇంటికి వెళ్లడం ద్వారా ప్రజల కష్టాలు తెలుస్తున్నాయి

## సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, క్లస్టర్ ప్రభాకర్





**చిప్పగిరి, ఆగస్టు, 22,( రిపబ్లిక్ న్యూస్)** ప్రతి ఇంటికి వెళ్లడం ద్వారా ప్రజల కష్టాలు తెలుస్తున్నాయని సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, క్లస్టర్ ప్రభాకర్ శనివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తూ తెలిపారు, మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆలూరు ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకే నిర్వహిస్తున్నామని ఈరోజు ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగిందని, ప్రజల కష్టాలు సమస్యలు తెలిశాయని, భవిష్యత్తులో ప్రజల సమస్యలు కష్టాలు తీర్చడానికి సులభం అవుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో కొండా పెద్దన్న, అశోక్ యాదవ్ ,కొట్టం గోవిందరాజులు ,రంజిత్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని తాగునీటి అవసరాలకు విడుదల చేయాలి

**ఎనిమిది గ్రామాల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి.. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**



కల్లూరు మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పరివాహక ప్రాంతంలోని ఎనిమిది గ్రామాల్లో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఇరిగేషన్ అధికారులను కోరారు.ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆయా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని ఆమె తెలిపారు. ప్రజలకే కాకుండా పశువులకు సైతం తాగునీరు అందని దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3,000 క్యూసెక్కులకు పైగా నీరు ప్రవహిస్తున్నందున, తమ ప్రాంతంలోని గ్రామాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి 150 క్యూసెక్కులు, లద్దగిరి సమీపంలోని స్లూయిస్ నుంచి మరో 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లోని బోర్లు పూర్తిగా ఎండిపోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని హంద్రీ నదిలోకి విడుదల చేస్తే తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారమవడంతో పాటు భూగర్భ జలాలు రీఛార్జ్ అయి బోర్లలో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందన్నారు.అలాగే కల్లూరు మండలంలోని ఉలిందకొండ చెరువుకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి, పరిసర గ్రామాల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

**గుండ్రేవుల ప్రాజెక్టును హై పవర్ కమిటీ పరిధిలోకి తీసుకురావాలి**

గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం కర్నూలు జిల్లా ప్రజల చిరకాల కోరిక అని గౌరు చరిత అన్నారు. ఈ ప్రాజెక్టును హై పవర్ కమిటీ పరిధిలోకి తీసుకురావాలని, ఇందుకు సంబంధించి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆమె అధికారులను కోరారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం

-బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

-మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి మూడో శనివారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో బయోమెడికల్ వ్యర్థాల సమర్థ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. క్యాజువాలిటీ నుంచి డైట్ విభాగం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి, పరిశుభ్రత ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం డైట్ విభాగం ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేసి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛమైన పరిసరాలు, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాయ్, ఆర్.ఎం.ఓ. డాక్టర్ వెంకట రమణ, డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి పరిపాలనాధికారి సింధు సుబ్రహ్మణ్యం, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పి. పద్మజ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వి. పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్లు, నర్సింగ్ విద్యార్థినులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయమే లక్ష్యం

శ్రేణులు సమష్టిగా కదలాలి.. ప్రజల్లోకి వెళ్లాలి

చంద్రబాబు రెండేళ్ల పాలనతో ప్రజలు విసిగిపోయారు: మాజీ ఎమ్మెల్యే



**గుత్తి ఆగస్టు 22 (రిపబ్లిక్ న్యూస్):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. శనివారం గుత్తిలో వైసీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమని అన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుకుంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని మాజీ ఎమ్మెల్యే విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో దీనిని స్పష్టం చేస్తారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీకి బలమని, నాయకత్వం ఇచ్చే బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని చెప్పారు. గ్రామాలు, వార్డుల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించుకుని బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కదిలితే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కసాపురం ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి భూమిపూజ

భక్తులకు మెరుగైన వసతులే లక్ష్యం: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





**గుంతకల్లు ఆగస్టు 22 (రిపబ్లిక్ న్యూస్)**

కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గుంతకల్లు మండలం కసాపురం గ్రామంలో భక్తుల వసతి సౌకర్యాల ఏర్పాటుకు చేపట్టనున్న పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు గుంతకల్లు మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

భూమిపూజకు ముందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భక్తుల వసతి గృహాల ఏర్పాటుకు సహకరిస్తున్న దాతలకు కూటమి ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కసాపురం గ్రామస్థులు, గుంతకల్లు పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ పాల్గొన్నారు.

# 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర'తో స్వచ్ఛతకు సరికొత్త రూపు

కేసీ కెనాల్‌లో యుద్ధప్రాతిపదికన గుర్రపుడెక్క తొలగింపు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**

స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర (సాసా) కార్యక్రమంతో కర్నూలు నగర స్వచ్ఛతకు సరికొత్త రూపు వస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాసా కార్యక్రమంలో భాగంగా జోహరాపురం కేసీ కెనాల్ బండ్ (పాకెట్ పార్క్) వద్ద మొక్కలు నాటారు. అనంతరం కేసీ కెనాల్‌లో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒక ప్రత్యేక అంశాన్ని చేపట్టి స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తుండటంతో నగరంలో క్రమంగా సమూల మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ నెల మూడో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించిన నేపథ్యంలో నాలుగో శనివారం సాసా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

కేసీ కెనాల్‌లో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు హిటాచీ యంత్రానికి ప్రత్యేకంగా రింగ్‌ను తయారు చేయించి, పది ట్రాక్టర్లను వినియోగిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. కాలువలో గుర్రపుడెక్క తొలగింపుతో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, శానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, హుస్సేన్, టీపీఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పోలీసు బృందాలకు యూనిఫాం, షూస్ అందజేత

ఎన్నికలు, వీవీఐపీ పర్యటనల నేపథ్యంలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**రాబోయే ఎన్నికలు, వీవీఐపీ/వీఐపీ పర్యటనల నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పాటు చేసిన 30 మంది స్పెషల్ పార్టీ పోలీసులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ యూనిఫాం, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలు, వీవీఐపీ/వీఐపీ పర్యటనలను దృష్టిలో ఉంచుకుని స్పెషల్ పార్టీ పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో క్రమశిక్షణ, అప్రమత్తత, సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఆర్ఐ నారాయణ, ఆర్ఎస్సై ప్రదీప్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జెడ్పీ బాలికల పాఠశాలలో తాగునీటి సమస్య

**గుత్తి ఆగస్టు 22 (రిపబ్లిక్ న్యూస్ )**




పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్ డిమాండ్ చేశారు. పాఠశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నప్పటికీ తాగునీటి సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలో సుమారు వెయ్యి మంది వరకు విద్యార్థినులు చదువుతున్నారని, వారందరికీ సరిపడా తాగునీరు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో తాగునీటి వసతిని మెరుగుపరిచి, విద్యార్థినులకు నిరంతరం స్వచ్ఛమైన నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని నవీన్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విజయ్,వంశీ,రాజేష్, తదితరులు పాల్గొన్నారు

# చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన కొట్లో బాబు





**ఆళ్లగడ్డ ఆగష్టు 22 రిపబ్లిక్ న్యూస్**

ఈరోజు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా హైదరాబాదులోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నందు రక్తదానం చేసిన ఆళ్లగడ్డ నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ కార్యనిర్వాహక సభ్యులు, జనసేన పార్టీ ఉయ్యాలవాడ మండల కన్వీనర్ దూదేకుల కొట్లో బాబు అలాగే ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం జనసేన నాయకులు, కర్నూలు జిల్లా మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధి మా భాష ఓబులంపల్లె మెగా ఫ్యాన్స్ పాల్గొన్నారు.

# అహోబిలం గ్రామం లో స్వర్ణంద్రా స్వచ్ఛంద్రా కార్యక్రమం



**ఆళ్లగడ్డ ఆగష్టు 22 రిపబ్లిక్ న్యూస్**

ఆళ్లగడ్డ మండలం లోనిఅహోబిలం గ్రామం లో ఈరోజు మండల ప్రత్యేక అధికారి నూర్జహన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం అహోబిలంలో ఏపీ ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ నందు నిర్వహించడమైనది ఈ స్వచ్ఛఆంధ్ర, స్వర్ణఆంధ్ర భాగంగా పాఠశాలలోని తరగతి గదులను టాయిలెట్స్ ను తనిఖీ చేయడం జరిగినది పాఠశాలను స్వచ్ఛంగా పెట్టుకోవడం మన బాధ్యత అని ప్రత్యేక అధికారి పిల్లలకు ఉద్దేశించి తెలిపారు. అనంతరం హౌసింగుకు సంబంధించి హౌసింగ్ ఙజుపూర్తి కానీ ఇండ్లలబ్ధిదారులతో మాట్లాడి ఇండ్లు పూర్తి చేయమని ఆలబ్ధిదారులను కోరడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో, హోసింగ్ ఙజు పాఠశాల సిబ్బంది మరియు ఆ గ్రామ పెద్దలు స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సిబ్బంది హాజరవ్వడం జరిగినది.

# రేగుంట లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మల్లాపూర్ ఆగష్టు 22 (రిపబ్లిక్ న్యూస్)**మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా, పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఊా రాములు, డీలర్ బొమ్మెన పావని, మహేష్, మారసు స్వామి, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రస్తుతానికి ఎల్ఎల్‌సీ నీరు తాగునీటికే

## నీరు మిగిలితే ఆరుతడి పంటలకు కేటాయింపు ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎల్ఎల్‌సీ నీటిని ప్రస్తుతానికి తాగునీటి అవసరాలకే వినియోగించాలని నిర్ణయించినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. తాగునీటి అవసరాలు పూర్తిగా తీరిన అనంతరం నీరు మిగిలితే ఆరుతడి పంటలకు కేటాయించే అంశంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఖరీఫ్ 2026–27 కాలానికి సంబంధించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని, మిగిలిన 22 మండలాల్లో వర్షపాత లోటు ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా సగటున సుమారు 37 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాన్ని ఏప్రిల్ నెల నుంచే గుర్తించి రైతులకు ముందస్తు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో గ్రామాల వారీగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తక్కువ నీరు




అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించినట్లు చెప్పారు. ఈ ముందస్తు చర్యల ఫలితంగా జిల్లాలో ఈ ఏడాది పంటల సరళిలో గణనీయమైన మార్పు కనిపిస్తోందన్నారు.

**రైతులందరికీ పంట బీమా**

వ్యవసాయ రంగంలో రైతులందరికీ పంట బీమా చేయించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పంటల బీమా కవరేజ్ గణనీయంగా పెరిగిందన్నారు. తొలుత జూలై 15 వరకు ఉన్న బీమా గడువును ప్రభుత్వం, బీమా సంస్థలతో చర్చించి జూలై 31 వరకు, కొన్ని పంటలకు ఆగస్టు 15 వరకు పొడిగించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**1.5 టీఎంసీలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపు**

భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన 1.5 టీఎంసీల నీటితో అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపినట్లు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని సాగునీటికి వినియోగిస్తే రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున తాగునీటికే ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేశారు.

ప్రస్తుతం జిల్లాలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. తాగునీటి కోసం కేటాయించిన నీటిని సాగునీటికి వినియోగించకుండా అన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇంకా 10.455 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయని పేర్కొన్నారు. నీటి కోసం ఇండెంట్ సమర్పించనున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం సమర్పించే ఇండెంట్‌ను తాగునీటి అవసరాల కోసమే వినియోగిస్తామని తెలిపారు. తాగునీటి అవసరాలు పూర్తిగా తీరిన తర్వాత నీరు మిగిలితే, ప్రభుత్వం, ఉన్నతాధికారులతో చర్చించి సాగునీటికి ఎంత మేర కేటాయించవచ్చో నిర్ణయం తీసుకుంటామని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ స్పష్టం చేశారు.

# ఏసీబీ పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు

## ఉద్యోగులు, అధికారులకు కర్నూలు ఏసీబీ డీఎస్పీ సీతారాం హెచ్చరిక

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**
ఏసీబీ అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులను ఫోన్‌లో బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని కర్నూలు ఏసీబీ డీఎస్పీ సీతారాం తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇలాంటి మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం తమకు అందినట్లు ఆయన వెల్లడించారు.
సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము ఏసీబీ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌గా పరిచయం చేసుకుంటూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. "మీపై ఏసీబీ విచారణ జరుగుతోంది.. మీ ఆస్తుల వివరాలు మా వద్ద ఉన్నాయి" అంటూ బెదిరించి, విచారణ నుంచి తప్పించేందుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. వారి మాటలు నమ్మి కొంతమంది ఉద్యోగులు డబ్బులు బదిలీ చేసినట్లు సమాచారం అందిందన్నారు.

**ఏసీబీ ఎప్పుడూ డబ్బులు డిమాండ్ చేయదు**




ఏసీబీ అధికారులు ఫోన్ చేసి ఎలాంటి పరిస్థితుల్లోనూ డబ్బులు డిమాండ్ చేయరని డీఎస్పీ సీతారాం స్పష్టం చేశారు. ఏసీబీ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు లేదా ఇతర సిబ్బంది ఎవరూ ఫోన్ ద్వారా ఉద్యోగులను బెదిరించి డబ్బులు అడగరని తెలిపారు. ఏసీబీ పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**కర్నూలు, నంద్యాల జిల్లాల ఉద్యోగులు అప్రమత్తం**

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, అధికారులు ఇలాంటి మోసపూరిత కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ఎవరైనా ఏసీబీ పేరుతో అనుమానాస్పదంగా ఫోన్ చేస్తే వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కర్నూలులోని ఉద్యోగులు నేరుగా ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించి వచ్చిన కాల్ నిజమైనదా కాదా నిర్ధారించుకోవచ్చని తెలిపారు.

**డబ్బులు బదిలీ చేయొద్దు**

ఇలాంటి మోసపూరిత కాల్స్ వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సీతారాం సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.
సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే అధికారులకు సమాచారం అందించి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# గంజాయి నిర్మూలనకు కర్నూలు పోలీసుల విస్తృత తనిఖీలు

### డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో అనుమానితులకు ప్రత్యేక పరీక్షలు.. -రైల్వే స్టేషన్, బస్టాండ్, సంకల్‌బాగ్, ఎల్కూర్ బంగ్లా ప్రాంతాల్లో తనిఖీలు

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)**
గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు కర్నూలు నగరంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా సమక్షంలో కర్నూలు రెండో పట్టణ సీఐ శ్రీధర్, నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ తమ సిబ్బందితో కలిసి కర్నూలు రైల్వే స్టేషన్, సంకల్‌బాగ్, బస్టాండ్, ఎల్కూర్ బంగ్లా తదితర ప్రాంతాల్లో అనుమానితులపై ప్రత్యేకంగా నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించారు.

**అనుమానితులకు ప్రత్యేక డ్రగ్స్ పరీక్షలు**

తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా కనిపించిన యువకులను గుర్తించి, జిల్లా పోలీస్ శాఖకు అందజేసిన డ్రగ్ డిటెక్షన్ కిట్స్ సహాయంతో పరీక్షలు నిర్వహించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను సేవించినట్లు అనుమానం ఉన్న వ్యక్తులకు ప్రత్యేకంగా డ్రగ్స్ పరీక్షలు చేపట్టారు.





**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై పోలీసులు యువతకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.
గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కర్నూలు పోలీసులు కోరారు. అలాగే డయల్ 112, డయల్ 100 లేదా ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని సూచించారు.
మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పాములపాడు వెలుగు కార్యాలయంలో మహిళలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించిన ఏఎస్ఐ- షేక్.నూర్ అహమ్మద్

**పాములపాడు ఆగస్టు-22 రిపబ్లిక్ న్యూస్:-** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డి.ఎస్.పి- ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు మరియు ఆత్మకూరు రూరల్ సీఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఆత్మకూరు శక్తీ టీం సిబ్బంది ఏఎస్ఐ- షేక్.నూర్ అహమ్మద్, ఉమెన్ హోమ్ గార్డ్ సుప్రియ లు పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న ధనలక్ష్మి మండల మహిళా సమాఖ్య భవనంలో హాజరైన మండలంలోని, పొదుపు సంఘాల మహిళా లీడర్ల కు మరియు అక్కడికి హాజరైన వారికి ఏపీఎం ఏ.ఉమా మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో శక్తీ యాప్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ- షేక్.నూర్ అహమ్మద్ మాట్లాడుతూ బాలికల, మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని, అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ



కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని అన్నారు. ఫేక్ కాల్స్, ఏపీకె ఫైల్స్ లాంటివి ఏదన్నా సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి, వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలనీ తెలియజేయడం జరిగింది. దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా శక్తీ యాప్ ను వారి సెల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేయించి, ఎవరైనా మీకు ఇబ్బంది పెట్టినట్లయితే అధైర్య పడకుండా మీకు రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన " శక్తీ యాప్ " ను ఉపయోగించి 112 కు గానీ, 1098 కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారి సహాయం పొందవచ్చు అని అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపడానికి ఇవ్వద్దని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా మీ ఇంట్లోని వారు మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఇతరులు లేక మీ ఇంట్లోని వారు మీ భర్త, కొడుకు, అన్నా, తమ్ముడు, మేనమామ లు ఎవ్వరైనా సరే మద్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచించారు. ఎవరైనా సరే త్రాగి వాహనం నడిపితే, పోలీసులకు చిక్కి కేసు పెడితే కోర్టు వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారని తెలుపుతూ, అవేర్నెస్ ప్రోగ్రాం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి (వెలుగు) సీసీలు, బుక్ కీపర్లు, మండలంలోని పొదుపు సంఘాల మహిళలు పాల్గొనడం జరిగింది.

# గస్తీలు మరచిన పోలీసులు -అధికమవుతున్న విద్యుత్ సామాగ్రి చోరీలు.

**రైల్వే కోడూరు ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఉన్న ఓబులవారిపల్లి, రైల్వే కోడూరు, పుల్లంపేట, చిట్వేలి,పెనగలూరు మండలాలలో విద్యుత్ సామాగ్రి చోరీలు అధికంగా జరుగుతున్నాయి. వీటి పట్ల చర్యలు తీసుకోవలసిన పోలీసుల గస్తీలు తగ్గడంతో రైతుల వ్యవసాయ పొలాల్లో చోరీలు అధికమై రైతులు లక్షల్లో నష్టపోతున్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా వ్యవసాయ బావుల వద్ద ఈ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల చోరీలు అధికమై రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తుండడం ఆనవాయితీగా మారిపోవడంతో పోలీసులు చేయాల్సిన పనిని వారు వాటి పట్ల శ్రద్ధ పెట్టకపోవడంతో రైతులే కాపు కాచి కొంతమంది విద్యుత్ సామాగ్రి చోరీలు చేసే దొంగలను పోలీసులకు పట్టించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. అయితే వారి నుంచి విద్యుత్ సామాగ్రి రికవరీ చేసి వారి పట్ల చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసి భవిష్యత్తులో ఇలాంటి చోరీలు జరగకుండా భయపెట్టాల్సిన పోలీసులు ప్రజలు పట్టించిన నిందితుల పట్ల నిర్లక్ష్యం వహించి మందలించి వదిలేయడంతో వాళ్లు యదా రాజా తథా ప్రజా అన్నట్లు చోరీలతో రైతుల నడ్డి విరుస్తూ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అమానుషం.ఇటీవల గత పది రోజుల నుంచి ఓబులవారిపల్లి మండలంలో చెన్నరాజుపోడు,గాదెల, చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లి, పెద్దవరంపాడు, పాపిరెడ్డి పల్లె, కొర్లకుంట ప్రాంతాలలో అధికంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పగులుగొట్టి అందులో ఉన్న కాపర్,ఆయిల్ సామాగ్రిని తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఇదే విధంగా మిగిలిన నాలుగు మండలాల్లో కూడా విద్యుత్ సామాగ్రి చోరీలు విపరీతంగా జరుగుతున్నాయి. ప్రతి రాత్రి రైతు పొలాల్లో మోటార్లు, స్టార్టర్ల వైర్లు, సోలార్ పరికరాలు దొంగిలిస్తూనే ఉన్నారు. ఓబులవారిపల్లి మండలంలో ఈ చోరీలు ఈరోజు ఆరోజు అనకుండా ప్రతినిత్యం పలుచోట్ల తరచూ జరుగుతూనే ఉన్నాయి.వీటిపట్ల రైతులు లక్షల్లో నష్టపోతున్నారు. విద్యుత్ చోరీలు చేసిన దొంగలు తీసుకువెళ్లిన సామాగ్రిని రైల్వేకోడూరులోనూ, రాజంపేట ప్రాంతాలలో గుజిరి వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు కూడా రైతులు కనుగొన్నారు. ఈ విషయంపై కూడా చోరీకి గురి అయిన వస్తువులను అక్రమంగా కొనుగోలు చేసిన ఆ వ్యాపారిపై రైతులు ఇటీవల కోడూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు కూడా తెలిసింది. అయితే ఆ స్టేషన్లలో బాధితుల కంటే అక్రమార్కులు అక్రమ విద్యుత్ సామాన్లను కొనుగోలు చేసే నిందితులకు సకల మర్యాదలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా రైతుల్లో లేకపోలేదు. వీటి పట్ల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి అనుమానాస్పదలైన రైతులు చెప్పిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి వాటిని అదుపు చేయకపోతే దేశానికి వెన్నుముక లాంటి రైతుల నష్టాలను పూడ్చే పరిస్థితులు ఉండకపోవచ్చు. ఇప్పటికీ గత పది రోజుల నుంచి లెక్కపెడితే ఓబులవారిపల్లి మండలంలో దాదాపు కోటి రూపాయల విలువచేసే రైతులకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, మోటారు వైర్లు, స్టార్టర్లు, సోలార్ పరికరాలు చోరీకి గురి అయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదే విధంగానే మిగిలిన నాలుగు మండలాల్లో కూడా చోరీలు అధికంగానే జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు .సామాగ్రి నష్టం ఒక ఎత్తు అయితే అవసరానికి తగ్గట్టుగా చోరీకి గురైన పరికరాలను

# కర్నూలులో ఘనంగా జాబ్ డ్రైవ్

## 750 మంది నిరుద్యోగ యువత హాజరు

### 101 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 22)** కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ డ్రైవ్‌కు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. వివిధ కంపెనీల్లోని 101 ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 750 మంది యువత హాజరయ్యారు.వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్ డ్రైవ్‌లో పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవాన్ని పరిశీలిస్తూ ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.జిల్లాలోని నిరుద్యోగ యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవానికి అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఈ జాబ్ డ్రైవ్ మంచి వేదికగా నిలిచింది. కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అభ్యర్థులకు లభించింది.ఈ కార్యక్రమాన్ని డిఆర్‌ఓ శ్రీమతి సి. వెంకటనారాయణమ్మ, జిఎమ్‌డిఐసి డి. సంజీవ రాజు, డెసో శ్రీమతి దీప్తి, డిసిడిఓ ఎల్. ఆనంద్ రాజ్ కుమార్ పర్యవేక్షించారు. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వారిని ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.
డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటువంటి జాబ్ డ్రైవ్‌ల ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు నేరుగా కంపెనీలతో ఇంటరాక్ట్ అయి ఉద్యోగాలను పొందేందుకు మంచి అవకాశం లభిస్తోందని పేర్కొన్నారు.జాబ్ డ్రైవ్ విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో డిఆర్‌ఓ సి. వెంకటనారాయణమ్మ, జిఎమ్‌డిఐసి డి. సంజీవ రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధికారులు, కంపెనీల ప్రతినిధులు, పాల్గొన్న యువతకు అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల చదువుకు ఈడిగ సంఘం అండ

### రాష్ట్ర అధ్యక్షులు మేకల వేణుగోపాల్

### లావణ్య విద్యాభ్యాసానికి రూ.10 వేల ఆర్థిక సాయం



**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 22,(రిపబ్లిక్ న్యూస్):**
విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం అందించేందుకు అన్నివేళలా ఈడిగ సంఘం అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షులు మేకల వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక ఇబ్బందులు ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈడిగ సంఘం సేవాభావాన్ని చాటుకుందన్నారు. బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లావణ్య విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో సంఘం తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మేకల వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు రావడం బాధాకరమన్నారు. అలాంటి విద్యార్థులను గుర్తించి సంఘం తరఫున సాధ్యమైనంత మేర సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.విద్యార్థుల చదువుకు అందించే సహాయం కేవలం ఆర్థిక పరమైనదే కాకుండా వారి భవిష్యత్తుకు ఇచ్చే ప్రోత్సాహమని ఆయన అన్నారు.
లావణ్య ఉన్నత విద్యను పూర్తి చేసి మంచి స్థాయికి చేరుకోవడంతో పాటు భవిష్యత్తులో మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఈడిగ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు గండ్లూరి నాగభూషణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరతాల సూర్యబాబు, జిల్లా ఈడిగ ఉద్యోగ సంఘం మాజీ అధ్యక్షులు నారాయణస్వామి, ట్రెజరర్ నారాయణస్వామి, ఈసీ సభ్యులు శ్రీరాములు, మారుతయ్య, శ్రీనివాసులు, వెంకటేశులు, ప్రసాద్, సీతారామరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
విద్య, యువత అభివృద్ధి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత వంటి సేవా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించేందుకు ఈడిగ సంఘం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.

# పవన్ ఆదేశాలతో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం



**అమరావతి,ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం కొనసాగుతోంది. డిప్యూటీ సీఎం ఆదేశాలతో జోరుగా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 20 వేల హెక్టార్లలో 2 కోట్లకు పైగా సీడ్ బాల్స్‌ను అధికారులు వెదజల్లారు. ఈ మేరకు 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో కీలక అడుగు పడింది. అడవుల పునరుద్ధరణ పక్రియలో డ్రోన్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో విస్తృతంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సీజన్‌లో 3 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లాలని లక్ష్యంగా అధికారులు తీసుకున్నారు. సీడ్ బాల్స్ విస్తరణ పక్రియ సరికొత్త మైలురాయిని చేరుకున్న సందర్భంగా అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ పవన్ కల్యాణ్ అభినందించారు.
------

# పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యా వ్యవస్థలోనేకొనసాగించాలి

## జీవో 97 ను రద్దు చేయాలి పి డి ఎస్ యు డిమాండ్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 ( రిపబ్లిక్ న్యూస్ )**

పాలిటెక్నిక్ విద్యను లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్జ్/స్కిల్ డెవలప్మెంట్ శాఖ పరిధిలోకి తీసుకురావాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పాలిటెక్నిక్ విద్యను కేవలం ఉద్యోగం కోసం అందించే నైపుణ్య శిక్షణగా పరిగణించడం సరికాదని కళాశాల ముందు నిరసన చేయడం జరిగింది అనంతరం పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ సంయుక్తంగా మాట్లాడుతూ . పాలిటెక్నిక్ అనేది మూడు సంవత్సరాల డిప్లొమా స్థాయి సాంకేతిక విద్య. ఇందులో ఇంజనీరింగ్ మాథమాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ తో పాటు వివిధ ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన కోర్ సబ్జెక్ట్స్, లాబొరేటరీస్, వర్క్ షాప్స్ , ఇంజనీరింగ్ డ్రాయింగ్, డిజైన్, ప్రాజెక్ట్, ఇండస్ట్రియన ట్రైనింగ్ వంటి అంశాలు ఉంటాయి. కాబట్టి పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన అకడమిక్ ,మరియు టెక్నికల్ క్యారెక్టర్ ఉంది.




లేబర్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ శాఖ ప్రధానంగా ఒకేషనల్ ట్రైనింగ్ ట్రేడ్స్ శాతం కోర్సెస్ ఎంప్లాయిబిలిటీ ఇమ్మీడియేట్ జాబ్ ఓరియెంటెడ్ దృష్టి పెడుతుందని దీని ద్వారా విద్యార్థులు చిన్న చిన్న ఉద్యోగాలు మాత్రమే పొందే అవకాశాలు ఉందని వాపోయారు. ఇంజనీరింగ్ విద్యకు పేద మధ్యతరగతి విద్యార్థులు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారుఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ విద్యను అదే వ్యవస్థలోకి తీసుకురావడం వల్ల దాని ఉన్నత సాంకేతిక విద్యా స్వభావం క్రమంగా బలహీనపడే ప్రమాదం ఉంది

పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు బీటెక్ లేటరల్ ఎంట్రీ ద్వారా చదవడానికి అవకాశాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే ఉన్నత విద్యను పూర్తి చేసి సమాజంలో ఇంజనీర్లుగా శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి అవకాశం ఉందని తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యను ఐటిఐ తో ముడి పెట్టడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ ఫ్యాకల్టీ కూడా సర్వీస్ రూల్స్, ఉద్యోగ పదోన్నతి లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

లక్షలాది మంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరమయ్యే విధానాలను విడనాడాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు డివిజన్ నాయకులు జస్వంత్ .తులసిరామ్. గణేష్ .కార్తీక్. హర్షవర్ధన్. కీర్తన. సలోమి. అశ్విని. మౌనిక. రాకేష్. సలీం. ఆకాష్. బాలరాజ్.తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగులకు యు డి ఐ డి ప్రత్యేక క్యాంపు తేదీలో మార్పు

**ఈనెల 25 ఆగస్టు దివ్యాంగులకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెదక్ నందు యూ డి ఐ డి శిబిరం**

**జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు**

**మెదక్ జిల్లా ప్రతి నిధి ఆగస్టు 22( రిపబ్లిక్ న్యూస్)**




దివ్యాంగులకు యూ.డిఐ.డి శిబిరం క్యాంపు ఏర్పాటుపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగా ఈనెల 26 తేదీన దివ్యాంగుల యూ డి ఐ డి క్యాంప్ నిర్వహించబడునని ప్రకటన జారీ చేయడం జరిగిందని. చెప్పారు. ఈనెల 26 వ తేదీన మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్న నేపథ్యంలో దివ్యాంగుల యు డి ఐ డి శిబిరాన్ని ఆగస్టు 25వ తేదీన ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెదక్ నందు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. నూతన చేయూత పెన్షన్ల దరఖాస్తులు ఈనెల 31న ముగుస్తున్న నేపథ్యంలో దివ్యాంగులు ఇంకా UDID ధృవీకరణ పత్రం రానివారు, ఆదివారం ఆగస్టు 25 సాయంత్రం వరకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి సోమువారం స్లాట్ బుక్ అవడం జరుగుతుందని మంగళవారం (25.08.2026) నాడు మెదక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు శిబిరం జరుపబడునన్నారు.యు డి ఐ డి దరఖాస్తు చేసుకున్న వారికి డి ఆర్ డి ఎ కార్యాలయం నుండి, మండల ఏపీఎం నుండి క్యాంపు నిర్వహణ సమాచారం తెలపబడునని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## జోగిపేటలో ఎస్వీ మార్ట్ షాప్ ఓపెన్ చేసిన జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ( చిట్టిబాబు )






**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 22 ( రిపబ్లిక్ న్యూస్)** అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా కోట నరేష్ గారు నూతనంగా ఏర్పాటు చేసిన ౖాం మార్ట్ ను గౌరవ మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి మార్ట్ ను ప్రారంభం చేయడం జరిగింది వారితో పాటుగా వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు )గారు మాజీ కౌన్సిలర్ న్యాయవాది అల్లే శ్రీకాంత్ గారు కోట సాయిబాబా గారు గజవాడ రాజేశ్వర్ గారు, బీపేట సంపత్ కుమార్ గారు, పోల రఘునాథ్ గారు, కోవూరి విజయ్ కుమార్ గారు, పురం రఘు గారు, గంగోత్రి శ్రీనివాస్ గారు, గాజుల పవన్ కుమార్ గారు, గొర్లకాడి కుమార్ గారు ఇంకా ఇతర పెద్దలు కుటుంబ సభ్యులు పుర ప్రముఖులు పాల్గొన్నారు

## సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్ష రేసులో బీసీ వర్గానికి చెందిన దాకూరి శివశంకర్ ముదిరాజ్

### -మంత్రి ఆశీస్సులు నాపై ఎల్లప్పుడూ ఉంటాయి

**ప్రజా రిపబ్లిక్ / అందోల్ ఆగస్టు 22**

ఆందోల్ నియోజకవర్గం జోగిపేట సంగారెడ్డి డిసిసి అధ్యక్ష రేసులో బీసీ వర్గానికి చెందిన దాకూరి శివశంకర్ నిబంధన నియమాలిక కలిగిన నాయకుడు 75 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని వారి తాత దాకూరి గాలయ్య గారు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీ చైర్మన్ సేవలందించి వారి నాన్నగారు దాకూరి జోగినాథ్ మూడుసార్లు పట్టణ సర్పంచ్ గా సేవలందించి దాకూరి శివ శంకర్ గారు జోగిపేట్ పట్టణ కౌన్సిలర్ గా సేవలందించి ఒకటే పట్టణానికి పరిమితమై ఏనాడు నామినేట్ పోస్టులు ఆశించలేదు ఈరోజు మన మంత్రి గారు దామోదర రాజనర్సింహా గారు మరియు ఏఐసీసీ గుర్తించి సంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.....



## తూర్పుగౌని ముదిరాజ్ సంఘము కు ఆనుకొని ఉన్న కందకము ఆక్రమించుకొని ఎటువంటి పర్మిషన్ లేకుండా అక్రమ కట్టడలు

### వార్డు ప్రజలు సంఘం సభ్యులు అడ్డుకొని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం

**ప్రజా రిపబ్లిక్ / అందోల్ ఆగస్టు 22**



ఆందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘానికి ఆనుకొని ఉన్న కందకం ఖాళీ స్థలాన్ని ( శ్రీ అయ్యప్ప విజయ్ ) అక్రమంగా ఆక్రమించి, ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అనధికార నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయించి, చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా అత్యవసర ఫిర్యాదు. మహోదయులకు, మేము జోగిపేట పట్టణంలోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘంకు చెందిన సభ్యులము. మా సంఘ ప్రాంగణానికి ఆనుకొని, వెనుక వైపున ఉన్న కందకం ఖాళీ స్థలాన్ని శ్రీ అయ్యప్ప విజయ్ ఎటువంటి హక్కు పత్రాలు, స్వామ్య ఆధారాలు లేదా చట్టబద్ధమైన మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా ఆక్రమించి, అక్కడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ అక్రమ ఆక్రమణ మరియు నిర్మాణ విషయమై ఇప్పటికే ఒకసారి గౌరవ కమిషనర్ గారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు/వినతిపత్రం సమర్పించాము. దానిపై స్పందించిన గౌరవ కమిషనర్ గారు స్వయంగా స్థలాన్ని సందర్శించి, సంబంధిత వ్యక్తిని పనులు నిలిపివేయాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను పూర్తిగా లెక్కచేయకుండా ప్రస్తుతం మళ్లీ ఎవరికీ తెలియకుండా, ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇది సాధారణ నిర్మాణ వివాదం కాదని, ప్రజా ప్రయోజనానికి సంబంధించిన ఖాళీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, అధికారుల ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ నిర్మాణం కొనసాగిస్తున్న తీవ్రమైన విషయం అని మా సంఘం తరపున తెలియజేస్తున్నాము.

## అల్మాయిపేట్ గ్రామంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు పుట్టినరోజు వేడుకలు

**ఆందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 22 ( రిపబ్లిక్ న్యూస్)**

ఆందోల్ మండలం పేట గ్రామంలో టిఆర్ఎస్ నాయకుడు మైసగొల్ల రమేష్ పుట్టినరోజు వేడుకలను మాజీ సర్పంచ్ బుడ్డోల్లరవిశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కుటుంబ సమేతంగా మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు అదే కాకుండా రాజకీయపరంగా మరెన్నో పదవులు అనుభవించి ముందుకు సాగాలని దీవించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు బీరప్ప బి ఆర్ఎస్ నాయకులు దండు అనిల్ కుమార్ బంటు అఖిల్ బేగరి పెంటయ్య గడ్డి బిక్షపతి పన్యాల దేవయ్య తదితరులు పాల్గొన్నారు



# తాడిపత్రిలో జేసీ రాజ్యం నడుస్తోంది

**గోవా మద్యంతో నాకు ఎలాంటి సంబంధం లేదు**

**అనుమానాలుంటే కమిటీ వేసి విచారణ చేయించండి**

**నారా చంద్రబాబు, నారా లోకేశ్‌కు పెద్దారెడ్డి విజ్ఞప్తి**

**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 22,(రిపబ్లిక్ న్యూస్):**

తాడిపత్రి నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల వ్యవహారశైలిపై మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, ఆయన తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డికి పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎలాంటి సూచనలు చేస్తున్నారో తనకు తెలియదని అన్నారు. గోవా మద్యం వ్యవహారంలో తనకు వాటా ఉందంటూ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తనపై అనుమానం ఉన్నా సరే నిష్పక్షపాతంగా కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని కోరారు. విచారణలో ఏది తేలితే దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు కూడా ఈ వ్యవహారంపై విచారణకు ముందుకు రావాలని కోరారు.



**పోలీస్ స్టేషన్లకు “జెసి పోలీస్ స్టేషన్“ అని పేరు పెట్టండి**

తాడిపత్రిలో మద్యం, మట్కా, గంజాయి, గ్యాంబ్లింగ్ వంటి అంశాలపై ఎలాంటి విచారణ జరిగినా తాను సిద్ధమేనని పెద్దారెడ్డి పేర్కొన్నారు. అయితే అనుమానాలను ఆధారంగా చేసుకుని తన కుటుంబం, అనుచరులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద కూర్చుంటానని, స్టేషన్‌కు వచ్చి సివిల్ పంచాయతీలు చేస్తానని చెప్పే పరిస్థితులు తాడిపత్రిలో నెలకొన్నాయని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లకు “జేసీ పోలీస్‌స్టేషన్ “, మున్సిపాలిటీకి “ జేసీ కార్పొరేషన్ “ అని పేరు పెట్టుకునే పరిస్థితి వచ్చిందంటూ ఎద్దేవా చేశారు.ప్రభుత్వం మారిన తర్వాత తాడిపత్రిలో ప్రజలపై, వ్యాపారులపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులు జరుగుతున్నాయని పెద్దారెడ్డి ఆరోపించారు. పోలీసు వ్యవస్థలోనూ జేసీ కుటుంబం పట్ల భయం కనిపిస్తోందన్నారు. పోలీస్‌స్టేషన్‌లోనే పంచాయతీలు చేయడం, అధికారులను ప్రభావితం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. షాపు యజమానులను బెదిరించే లేదా తిట్టే హక్కు ఎవరికీ లేదని, వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**ఒకే వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడు చేయడం తగదు**

తన కుటుంబ సభ్యులను దూషించడంతోనే తాను ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లాల్సి వచ్చిందని పెద్దారెడ్డి తెలిపారు. వివాహ వేడుకల్లో కూడా గొడవలు, దాడుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. గంజాయి బ్యాచ్‌లను ఉపయోగించి దాడులు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ఇలాంటి ఘటనలపై పోలీసులు సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం తగదని హితవు పలికారు.జేసీ ప్రభాకర్‌రెడ్డిపై అనేక కేసులు ఉన్నాయని రాజకీయ విమర్శలు చేయడం కాకుండా, వాటి విషయంలో చట్ట ప్రకారం విచారణ జరగాలని పెద్దారెడ్డి అన్నారు. తనపై కూడా ఆరోపణలు ఉంటే విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని కోరారు. తనపై కేసులు పెట్టి, ప్రత్యర్థులపై నమోదైన కేసుల్లో బెయిళ్లు వస్తున్నాయని విమర్శలు చేయడం కంటే అన్ని కేసులపై సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని పేర్కొన్నారు.

**తనను అడ్డుకునే శక్తి తాడిపత్రిలో ఎవరికీ లేదు**

తాడిపత్రిలో డంపింగ్‌యార్డు ఎక్కడ ఉందో చెప్పాలని, నోటీసులు ఇవ్వడంలో కూడా రాజకీయ వివక్ష చూపుతున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. కొంతమందికే నోటీసులు ఇచ్చి, మరికొందరిని వదిలేస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బందితో ఇళ్లను ఖాళీ చేయించేందుకు ఒత్తిడి తెస్తున్నారనే వాటిపై కూడా విచారణ జరపాలని కోరారు.తాడిపత్రి ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డిని ఉద్దేశించి పెద్దారెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. తనపై లిక్కర్ మాఫియా ఆరోపణలు చేసే ముందు ఆధారాలు చూపాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యేపై ఈ స్థాయిలో దిగజారి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాడిపత్రి పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ సీనియర్ నాయకులు కేశవ్, కాలువ శ్రీనివాసులు, టీజీ భరత్ తదితరులు స్పందించి కమిటీ ఏర్పాటు చేసి నిజానిజాలు తేల్చాలని, ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటానని పెద్దారెడ్డి చెప్పారు. తనను అడ్డుకునే శక్తి తాడిపత్రిలోనే కాదు.. అనంతపురం జిల్లాలో ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో శాంతిభద్రతల సమస్యకు తానే కారణమని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు ఎవరి వల్ల ఏర్పడుతున్నాయో పోలీసులు, ప్రభుత్వం ఆలోచించుకోవాలని సూచించారు.

తాడిపత్రిలో ప్రస్తుతం “ జేసీ రాజ్యం “ నడుస్తోందని పెద్దారెడ్డి ఆరోపించారు. అయితే రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత ఆరోపణలకు బదులుగా ప్రభుత్వం, పోలీసులు ప్రతి అంశాన్ని చట్టపరంగా విచారించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. గోవా మద్యం వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని మరోసారి స్పష్టం చేస్తూ..

తనపై గానీ, తన అనుచరులపై గానీ అనుమానం ఉంటే సుమోటోగా విచారణ చేపట్టి నిజానిజాలు బయటపెట్టాలని పెద్దారెడ్డి సవాల్ చేశారు.

# నీటిని పొదుపుగా వాడాలి

**రెండు మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలి**

**వర్షాలు కరువు.. నీటి వనరులకు ముప్పు**

**నీటి పొదుపుపై అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 22,(రిపబ్లిక్ న్యూస్):**



జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రెండు మూడు నెలలు తాగునీటి వినియోగంలో ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 40 శాతం లోటు ఉన్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావం జిల్లాలోని నీటి వనరులపై పడుతోందని, ముఖ్యంగా తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రానున్న రోజుల్లో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

**నీటి వినియోగంపై ముందస్తు చర్యలు చేపట్టాలి**

ఎల్-నినో ప్రభావంతో పాటు హెచ్ఎల్‌సీ, జీబీసీ కాలువల ద్వారా అందుతున్న నీటి వనరులపైనా పరిస్థితుల ప్రభావం కనిపిస్తోందన్నారు. జిల్లాలో ప్రధానంగా రెండు కీలక నీటి వ్యవస్థలు ఉన్నాయని, వాటి ద్వారా అందుబాటులోకి వచ్చే నీటిని ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు.హెచ్ఎల్‌సీ పరిధిలో సుమారు 16 టీఎంసీల మేర నీటి లభ్యత ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు సుమారు 40 నుంచి 45 శాతం మేర మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిని సాధారణంగా తీసుకోకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంపై ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి వనరులను పర్యవేక్షిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.తాగునీటి విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఇంటి అవసరాల నుంచి గ్రామాలు, పట్టణాల వరకు ఎక్కడా నీరు వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. రానున్న రెండు మూడు నెలలు నీటి వినియోగంలో కీలకమైన కాలమని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులను ఎక్కువకాలం కాపాడుకోవచ్చని తెలిపారు. అవసరానికి మించి నీటిని వినియోగించడం, వృథాగా వదిలేయడం వంటి చర్యలను నివారించాలని ప్రజలకు సూచించారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులుజిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో నీటి కొరతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నీటి వనరుల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్‌లో ఎదురయ్యే అవసరాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. ఇందుకోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**సమస్య తీవ్రరూపం దాల్చకుండా పర్యవేక్షించాలి**

ఎల్ లైన్‌లోనూ నీటి సమస్యలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలు, ప్రస్తుత సరఫరా పరిస్థితి, భవిష్యత్ అవసరాలను అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఏ ప్రాంతంలోనూ తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.హెచ్ఎల్‌సీ, పీఏబీఆర్ పరిధిలో ప్రస్తుతం సుమారు 1,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అందుబాటులో ఉన్న నీటి ప్రవాహం, నిల్వలు, భవిష్యత్ అవసరాలపై అధికారులు నిరంతరం సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. నీటి వనరుల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.వర్షపాతం లోటు కొనసాగుతున్న నేపథ్యంలో భవిష్యత్ నీటి అవసరాలపై ముందుగానే కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి వనరుల లభ్యత, నిల్వలు, వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా అధికారులకు సహకరిస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి చుక్క నీటినీ విలువైనదిగా భావించి వినియోగించినప్పుడే రానున్న రెండు మూడు నెలల్లో నీటి కొరతను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఉత్తమ తహసిల్దార్గా, ఎస్ నాగార్జునకు వారం రోజులు తిరగకముందే వివరణ కోరుతూ కలెక్టర్ మేమొ.....

**రాయికల్ మండలం ఆగస్టు,22( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల తాసిల్దార్ కార్యాలయములో విధుల నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉన్నతాధికారుల నుంచి అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్న రాయికల్ తహసిల్దార్ ఎస్ నాగార్జునకు వారం రోజులు తిరగకముందే వివరణ కోరుతూ కలెక్టర్ కార్యాలయం మేమొ జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది,
ఆగస్టు 15న నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో తహసిల్దార్ నాగార్జునకు జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా అప్రిషియేషన్ సర్టిఫికెట్ అందింది, విధుల పట్ల చూపిన పనితీరుకు గుర్తింపుగా ఈ ప్రశంస పత్రం అందుకున్న ఆయనకు ఆరు రోజులు గడవకముందే, ఆగస్టు 21న కలెక్టర్ కార్యాలయం నుంచి మేమొ జారీ అయింది




**రీ సర్వే సమస్యలపై....**
రాయికల్ మండలంలోని దవన్ పెల్లి ఉప్పుమడుగు గ్రామాల్లో రి సర్వే సందర్భంగా తలెత్తిన సమస్యలు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో తహసిల్దార్ విఫలమయ్యారని మెమోలో పేర్కొన్నారు. సమస్యలను సకాలంలో నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పరిపాలనకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు.

**24 గంటల్లో వివరణ...**
విధుల పట్ల నిర్లక్ష్యం, బాధ్యతల నిర్వహణలో తగిన శ్రద్ధ చూపలేదని ఆరోపణలపై తెలంగాణ సివిల్ సర్వీసెస్ ( వర్గీకరణ, నియంత్రణ, అపిల్ ) నియమాలు–1991 ప్రకారం ఎందుకు క్రమశిక్షణ చర్యలు చేపట్టకూడదు వివరణ ఇవ్వాలని ఆదేశించారు, మేము అందిన 24 గంటల్లోపు వివరణ సమర్పించాలని, లేకుంటే అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. వారం రోజుల వ్యవధిలోనే ప్రశంస పత్రం నుంచి వివరణ మెమో వరకు పరిణామాలు చేసుకోవడం రాయికల్ రెవెన్యూ వర్గాల్లో చర్చకు దారితీసింది.

# రాయికల్ లో గోసంగి కుల సంఘ నాయకులను ఘనంగా సన్మానించిన బిఆర్ ఎస్ జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్.కట్కా శీరవీందర్

**రాయికల్ మండలం ఆగస్టు,22( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కటుకం రవీందర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధికార ప్రతినిధి కలమడుగు తిరుపతి మరియు గోసంగి కుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా కమిటీ నాయకులు జిల్లా గౌరవ అధ్యక్షులు నేరళ్ళ వినోద్ కుమార్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలమడుగు రమేష్, జిల్లా అధికార ప్రతినిధిగా మొలుగు వెంకటేష్ ల ను జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. అనంతరం సంఘానికి నిస్వార్ధంగా సేవ చేసి సంఘాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని నూతన నాయకులకు సలహాలు సూచనలు ఇచ్చారుఈ కార్యక్రమం లో రాయికల్ పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్ మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్ కౌన్సిలర్ లు రాకేష్ నాయక్ నాగరాజు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మరంపెల్లి రాణి సాయి కుమార్ గోసంగి కుల అధ్యక్షులు మహేష్ తెరాస నాయకులు రామచంద్రం, గంగారెడ్డి యూత్ నాయకులు రాంప్రసాద్ మహేందర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ తెల్ల విశాల్ కు ఇల్లు కూలి తలకు తీవ్ర గాయాలు

**ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించితే 10 లక్షలు కావాలంటున్న....**

**డబ్బులు లేక విలవిలలాడుతున్న కుటుంబం ఆర్థిక సహాయం కొరకై ఎదురుచూస్తున్న విశాల్ కుటుంబీకులు**

**రాయికల్ మండలం ఆగస్టు,22( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంకు చెందిన రెక్కడితే డొక్కాడని కుటుంబం ఆపద వస్తే ఆ దేవుడు ఒక్కడే ఉన్నాడని నమ్మి!! పరిస్థితులు అంతు పట్టలేక ఇల్లు కూలి అబ్బాయికి తలకు తీవ్ర గాయం కరీంనగర్ హాస్పిటల్ కి తరలింపు డబ్బులు లేక విలవిలాడుతున్నా కుటుంబం జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రానికి చెందిన తెల్ల విశాల్ కు వారి ఇంటి ఇల్లు కూలి అబ్బాయికి తీవ్రంగా తలకు గాయం అవడం జరిగింది ఈ అబ్బాయిని మరి కరీంనగర్కు హాస్పిటల్కు తీసుకెళ్లడం జరిగింది. ఈ అబ్బాయికి సుమారు పది లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్ చెప్పగానే వారి యొక్క తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు కారుస్తా ఉన్నారు ఎందుకంటే వారు ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తులు ఎన్ని డబ్బులు తీసుకురావాలంటే వాళ్లకు ఏం చేయాలో అర్థం అయితలే రెక్క ఆడితేన గాని డొక్కాడని కుటుంబ మనమందరం తల చెయ్యి ఏసి అబ్బాయిని కాపాడుకుందాం ఫ్రెండ్స్ మీకు తోచినంత సహాయం చెయ్యండ వారి యొక్క ఫోన్ నెంబర్ పెడతా ఫోన్ పే చేయండి ప్లీజ్. 8008192221 చాలా నిరుపేద కుటుంబం చెందిన కుటుంబం మిత్రులు దయచేసి తలో చేయ్యేద్దశీ ప్రాణం కాపాడాలి!!

# సాగునీరు రైతుల హక్కు

**తెలుగు గంగ జలాల సాధనకు కార్యచరణ సిద్ధం**

**సాగునీరు ఇవ్వకుంటే పోరాటం ఉధృతం చేస్తాం**

**గత మాప్రభుత్వ పెద్దలను ఎదురించి రైతులకు సాగునీరు అందించా**

**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రైతుల పక్షాన పోరాడాలి**

**సాగునీటి కోసం రైతులతో ప్రత్యేక సమావేశాలు**

**మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి**





**బండి ఆత్మకూరు, ఆగస్టు 22,( రిపబ్లిక్ న్యూస్):-**
శ్రీశైలం ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన బండి ఆత్మకూరు మండలంలో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆయన మండలంలోని ఈర్నపాడు, లింగాపురం, పార్నపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో కలిసి పొలాల్లోకి వెళ్లి సాగునీరు అందక ఎండిపోయిన భూములను,పంట పొలాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాంతానికి రావాల్సిన న్యాయమైన నీటి వాటాను అందించకుండా ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, మన హక్కైన తెలుగుగంగ కాలువకు సాగునీటిని సాధించుకునేందుకు రైతులతో కలిసి త్వరలోనే బలమైన కార్యాచరణ రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు.రైతులకు సాగునీరు అందే వరకు వారి పక్షాన నిలబడి అలుపెరగని పోరాటం చేస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి భరోసా ఇచ్చారు. ఇందుకోసం రైతులు కూడా సాగునీటిని సాధించుకునేందుకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే రైతులతో కలిసి ముందలాది ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టి డ్యామును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గతంలో ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పుడు తమ వైసిపి ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండి కూడా రైతుల సాగునీటి కోసం ప్రభుత్వ పెద్దలను ఎదిరించి రైతులకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురు శిష్యులు ఇద్దరు కలిసి రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఎత్తి పోతల పథకం ద్వారా నీటిని తరలించుకు పోతున్నారని, కానీ కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ భారెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మీసాల సుబ్బారెడ్డి, సగిలే కృష్ణరెడ్డి, వెంకట రెడ్డి, గోపాల్ రెడ్డి, పెద్ద రామ సుబ్బారెడ్డి, దేసు వెంకట రామిరెడ్డి, రేగటి జగన్మోహన్ రెడ్డి, రేగటి బలరామిరెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రామిరెడ్డి, కృష్ణ మల్లారెడ్డి, బూరం శివ లింగం, తులు,మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# చెర్ల కొండపూర్ గ్రామ మత్స్య శాఖ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ ని శాలువా సత్కరించిన జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత సురేష్



**రాయికల్ మండలం ఆగస్టు,22( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో రాయికల్,చెర్ల కొండాపూర్ గ్రామ మత్స్య సహకార సంఘం ఏకగ్రీవం ఎన్నిక సందర్భంగా అధ్యక్షులు,ఉప అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ని మర్యాద పూర్వకంగా కాలువగా,నూతన మత్స్య సహకార సంఘ సభ్యులను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన దావ వసంత సురేష్
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్ సహకార సంఘం అధ్యక్షులు లక్ష్మి నారాయణ ఉప అధ్యక్షుడు కల్లెడ శేఖర్ కార్యదర్శి డైరెక్టర్లు రాజం నారాయణ నరేష్ సురేష్ లింగం నవీన్ గంగపుత్ర సంఘ పెద్ద మనుషులు రవి సత్యనారాయణ రాజేష్ శంకర్ ఆశాలు కృష్ణయ్య వెంకటి నరేష్ రాజనర్సయ్య మహేష్ శివ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర సాధనకు అందరూ సహకరించాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, ఆగస్టు, 22 రిపబ్లిక్ న్యూస్**
స్వర్ణాంధ్ర–స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా శ్రమించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ, రామునాయక్ కలెక్టరేట్ ఎఓ సుభాకర్ రావు, డిఎస్ఓ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణకు గాను ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పొందాలన్నారు. ఈ విషయంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా జిల్లా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ విస్తృతంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించి పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించారు. అదే విధంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

# ప్రశ్నిస్తేనే పాలనలో కదలిక...

**నూకపెల్లి అభివృద్ధికి 32 కోట్లు కేటాయింపు జనసేన పోరాట ఫలితమే! బెక్కంజనార్ధన్**






**రాయికల్ మండలం ఆగస్టు,22( రిపబ్లిక్ న్యూస్)** ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తే ప్రభుత్వాలు దిగిరాక తప్పదని మరోసారి రుజువైంది అని జనసేన జగిత్యాల జిల్లా సీనియర్ నేత బెక్కం జనార్ధన్ అన్నారు జగిత్యాల నియోజకవర్గంలోని నూకపెల్లి 2దీఎఖ ఇళ్ల సమస్యలు మరియు కనీస మౌలిక సదుపాయాల కొరతపై ప్రశ్నించడానికి వెళ్లిన జనసేన పార్టీ నాయకులను ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రజా సమస్యలను గొంతెత్తి అడిగితే అణచివేయాలని చూసే పాలకులకు జనసేన పార్టీ హెచ్చరిక ఇది.అయితే, జనసేన నాయకుల ఒత్తిడి, ప్రజా సమస్యలపై వారు చేసిన పోరాట తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. నూకపెల్లి ప్రాంత అభివృద్ధి మరియు మౌలిక వసతుల కల్పన కోసం రూ. 32 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.
**ప్రశ్నించే గొంతుకై జనసేన:**అధికారాన్ని అడ్డంపెట్టుకుని అణచివేయాలని చూస్తే భయపడే ప్రసక్తే లేదు. కేవలం రాజకీయాల కోసం కాకుండా, ప్రజల కష్టాలను తీర్చడమే ధ్యేయంగా జనసేన నాయకులు నిరంతరం శ్రమిస్తున్నారు. నూకపెల్లిలో సమస్యలపై ప్రశ్నించినందుకే అరెస్టులు చేసినప్పటికీ, అదే గొంతుక ఆ ప్రాంతానికి 32 కోట్ల రూపాయల నిధులు వచ్చేలా చేసింది అని అన్నారు

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిస్సింగ్ కేసును చేదించిన తాలూకా పోలీసులు

**నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలురు అదృశ్యం -తక్షణ చర్యలతో కడప రైల్వే స్టేషన్ వద్ద సురక్షితంగా గుర్తించిన పోలీసులు**



**నంద్యాల క్రైం, ఆగస్టు 22, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని ప్రముఖ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలురు పాఠశాల/హాస్టల్ నుండి సిబ్బందికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లినట్లు స్కూల్ ప్రిన్సిపల్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన వెంటనే పోలీసులు ఎటువంటి ఆలస్యం చేయకుండా అదృశ్యమైన బాలుర ఆచూకీ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. బాలురు వెళ్లి ఉండే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించుటకు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అందులో ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని నంద్యాల బస్ స్టాండ్ ప్రాంతానికి, రెండవ ప్రత్యేక బృందాన్ని నంద్యాల రైల్వే స్టేషన్ ప్రాంతానికి, మూడవ బృందాన్ని మహానంది వైపు పంపించి గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది. శ్రీశైలం కమాండ్ కంట్రోల్ కు మిస్సింగ్ బాలుర ఫోటోలు, వివరాలను పంపి తగిన చర్యలు చేపట్టమని కోరడమైనది. అదే సమయంలో బాలుర ప్రయాణానికి సంబంధించిన సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తూ, వారు ఏ మార్గంలో వెళ్లారనే విషయంపై సాంకేతిక ఆధారాలను సేకరించడం జరిగింది. సీసీటీవీ సమాచారం ఆధారంగా బాలుర కదలికలకు సంబంధించిన వివరాలు నంద్యాల రైల్వే స్టేషన్ నందు తిరుపతి రైలు ఎక్కినట్లు సమాచారం లభించడంతో, సంబంధిత సమాచారాన్ని కడప పోలీసులకు తెలియజేసి, అదృశ్యమైన బాలుర వివరాలు, వారి ఫోటోలును పంపించి, కడప రైల్వే స్టేషన్ ప్రాంతాలలో అప్రమత్తం చేయడం జరిగింది.

**బాలుర ఆచూకీ**
నంద్యాల పోలీసులు, కడప పోలీసుల మధ్య సమన్వయంతో చేపట్టిన గాలింపు చర్యల ఫలితంగా, అదృశ్యమైన ఇద్దరు బాలురను కేసు నమోదైన కడప రైల్వే స్టేషన్ వద్ద సురక్షితంగా గుర్తించడం జరిగింది. అనంతరం వారిని పోలీసుల సమక్షంలో సురక్షితంగా తీసుకువచ్చి, వారి తల్లిదండ్రులకు అప్పగించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది.

**పోలీసుల చర్యలు**
ఈ ఘటనలో బాలుర అదృశ్యం విషయం తెలిసిన వెంటనే కేసు నమోదు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలకు ప్రత్యేక పోలీసు బృందాలను పంపడం, సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడం, బాలుర ఫోటోలు, వివరాలను ఇతర పోలీస్ స్టేషన్లకు, ముఖ్యంగా కడప పోలీసులకు పంపించడం, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడం సమయస్ఫూర్తితో వ్యవహరించి, సాంకేతిక ఆధారాలను ఉపయోగించడంతో పాటు ఇతర జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకోవడం ద్వారా ఇద్దరు బాలురను సురక్షితంగా గుర్తించడం జరిగింది. అదృశ్యమైన బాలురను తక్కువ సమయంలో అనగా కేసు రిజిస్టర్ చేసిన 4 గంటలలోపు సురక్షితంగా గుర్తించేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

ప్రజా రిపబ్లిక్



# నంద్యాల ఆర్ ఏ ఆర్ ఎస్ ,మార్కెట్ యార్డ్‌లను తక్షణమే కాపాడాలి!

**శాస్త్రవేత్తల ల్యాబ్‌లలో పాలన ఏంటి కలెక్టరేట్‌ను వెంటనే బయటకు తరలించాలి.**

**ఇది నాయకుల పోరాటం కాదు..**

**ప్రతి ఒక్కరి ఆహార భద్రత సమస్య!**

**-- అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్**

**నూనెపల్లె మార్కెట్ యార్డును సందర్శించిన ఐక్యవేదిక నాయకులు**

**యార్డులో జరుగుతున్న పశువుల సంతలో రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించిన నాయకులు**





**నంద్యాల ఆగస్టు 22( రిపబ్లిక్ న్యూస్) :** రైతన్నల నోట్లో మట్టికొడుతూ, ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రభుత్వం నడుపుతున్న వ్యాపార, రాజకీయ ధోరణులపై అఖిలపక్ష ఐక్యవేదిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నూనెపల్లె మార్కెట్ యార్డు పరిరక్షణ, 125 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా నంద్యాల పట్టణంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టిన అఖిలపక్ష ఐక్యవేదిక నేతలు శనివారం నూనెపల్లె మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా యార్డులో జరిగిన పశు వుల సంతకు విచ్చేసిన వేలాది మంది రైతులు, వ్యాపారులు మరియు ప్రజలను నేరుగా కలుసుకొని ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను విడమరిచి చెప్పారు.

ఈ సందర్శన సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ... "రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేలా చేయడం, దళారీల మోసాల నుండి కాపాడడం, ధాన్యానికి తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పించడం కోసం ఎంతోమంది పెద్దల త్యాగాలు, కృషి ఫలితంగా ఈ మార్కెట్ యార్డ్ రూపుదిద్దుకుంది. యార్డ్ సిస్తు ద్వారా వచ్చే నిధులతో గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు కల్పించేవారు. కానీ నేడు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ యార్డ్ నిర్వీర్యమైపోయింది. మార్కెట్ యార్డుకు చెందిన భూముల్లో కూడా రాజకీయ ప్రయోజనాల కోసం, అధికార టీడీపీ కార్యాలయానికి రెండు ఎకరాల విలువైన స్థలాన్ని కేటాయించడం దుర్మార్గమైన చర్య" అని మండిపడ్డారు.

గతంలో ఎన్ ఎం సి నిబంధనల ప్రకారం నంద్యాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం 8 ఎకరాల యార్డ్ స్థలాన్ని కోరితే, "మార్కెట్ యార్డ్ బ్రహ్మాండంగా పనిచేస్తోంది, స్థలం ఇవ్వలేం" అని అప్పటి కలెక్టర్ కోర్టులో అఫిడవిట్ వేశారు. కానీ నేడు అదే స్థలాన్ని పార్టీ కార్యాలయానికి ఎకరా వెయ్యి రూపాయలకు చొప్పున కేటాయిస్తూ "యార్డ్ నిర్వీర్యమైంది" అని నివేదికలివ్వడం పాలకుల, అధికారుల ద్వంద్వ నీతికి నిదర్శనం అని ఎండగట్టారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ద్వారా పప్పుధాన్యాలు, ఆయిల్ సీడ్స్ పరిశోధనల కోసం నిర్మించిన ఆర్ఆర్ఎస్ భవనాలను 'కేవలం ఏడాది కాలపరిమితి' అని చెప్పి కలెక్టరేట్ కోసం తీసుకున్నారు. నేడు 5 ఏళ్లు గడుస్తున్నా ఖాళీ చేయకపోగా... ఒంటె ఎడారిలో డేరాను ఆక్రమించినట్లు షెడ్లు, క్యాంటీన్లు, హాల్స్ కట్టుకుంటూ శాస్త్రవేత్తల ప్రయోగశాలలను, రీసెర్చ్‌ను సర్వనాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు.

**కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలి**

: ఆర్ ఏ ఆర్ ఎస్ భవనాల నుండి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే ఖాళీ చేసి, వ్యవసాయ పరిశోధనలకు ఆ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో అప్పగించాలి. అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నూనెపల్లె మార్కెట్ యార్డ్‌లో పార్టీ ఆఫీస్ కోసం కేటాయించిన 2 ఎకరాల భూమిని తక్షణమే వెంటనే వెనక్కి తీసుకోవాలనీ, యార్డ్‌ను ఆధునీకరించి రైతుల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రజల ఆహార భద్రతకు, రైతు సంక్షేమానికి వెన్నుముక లాంటి ఆర్.ఆర్.ఎస్., మార్కెట్ యార్డ్‌లను కాపాడుకోవడానికి ప్రజా ఉద్యమం ఉధృతం అవుతోంది. న్యాయశాఖ మంత్రి గారు ఈ ప్రాంత ప్రజలకు చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోవాలి.

ప్రజలు తిరగబడకముందే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి అని ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. నంద్యాల ఆర్.ఆర్.ఎస్., మార్కెట్ యార్డ్ భూముల రక్షణ కోసం సిపిఐ, సిపిఎం, స్థానిక ప్రజా సంఘాలు, రైతు నాయకులు కలసికట్టుగా పోరాడుతుంటే... రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నోరు మెదపకపోవడం దారుణం. అధికార టిడిపి బహిరంగంగా రైతు ఆస్తులను ఆక్రమిస్తుంటే, ప్రతిపక్ష వైసిపి కనీసం ప్రశ్నించకపోవడం చూస్తుంటే అధికార, ప్రతిపక్షాలు రెండూ లోపాయికారీగా కుమ్మక్కయ్యాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి, రైతాంగ పోరాటాల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా విపక్షాలు తమ మౌనాన్ని వీడి ఈ పోరాటంలో కలిసిరావాలి, లేకపోతే ప్రజల ముందు నిలదీత తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఎస్ డి పి ఐ నాయకులు ఏజెస్ హుస్సేన్, న్యూ డెమోక్రసీ పట్టణ నాయకులు చౌడప్ప, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమన్న, విశ్రాంత ప్రొఫెసర్ శివరాం రెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు షణ్ముఖరావు, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

**శాంతిభద్రతలు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎస్పీ సునీల్ షరాన్**







**నంద్యాల బ్యూరో, ఆగస్టు 22(రిపబ్లిక్ న్యూస్):** వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. లిశనివారం కలెక్టరేట్ లోనే వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ నిమజ్జన పై జిల్లా ఎస్పీ సునీల్ షరాన్, డి ఆర్ ఓ రాము నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలనీ తెలిపారు. 2024, 2025 సంవత్సరాల్లో చేపట్టిన విధంగానే ఈ సంవత్సరం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నందున గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతంగా ఏర్పాట్లును చేయాలని సూచించారు. సెప్టెంబర్ 14 న వినాయక చవితి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. ఉత్సవాలు, నిమజ్జన తేదీలు ముందుగానే ఖరారు చేసి, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టరేట్ నుంచి 2,500 మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా రహదారుల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి చిన్న చెరువు వరకు నిమజ్జన ఊరేగింపులు జరిగే మార్గాల్లో ఉన్న గుంతలను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే పూడ్చి రహదారులను సురక్షితంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఊరేగింపుల సమయంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్




భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిమజ్జన, ఊరేగింపు మార్గాల్లో ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని చిన్న చెరువు వద్ద ఐదు నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేసీ కెనాల్ అధికారులతో సమన్వయం చేసుకుని నిమజ్జనానికి అవసరమైన స్థాయిలో నీటి మట్టాన్ని నిర్వహించాలని సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద 24 గంటల లైటింగ్, పారిశుధ్యం, తాగునీరు, జనరేటర్లు, ఫైర్ సేఫ్టీ, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పెద్ద విగ్రహాల నిమజ్జనానికి నీరు సరిపోని ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక చెరువులు ఏర్పాటు చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈతగాళ్లు, పడవలు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలనీ తెలిపారు.

మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిమజ్జన ప్రదేశాల వద్ద అవసరమైన సంఖ్యలో పుట్టీలు, పడవలు, శిక్షణ పొందిన ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అధికారులు 24/7 షిఫ్టుల వారీగా విధుల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ, రవాణా శాఖలు ముందుగానే రూట్ డైవర్షన్ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు మంచి కండిషన్‌లో ఉన్న క్రేన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వైద్య, అత్యవసర సేవలు సిద్ధంగా ఉండాలనీనిమజ్జన ప్రదేశాల వద్ద 108, 104 అంబులెన్సులతో పాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్య సేవలకు నంద్యాల జీజీహెచ్ ఆసుపత్రిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎన్నికల పనులు కూడా సమాంతరంగా పూర్తి చేయాలనీ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల పరిశీలన, ఓటర్ల జాబితా తదితర పనులను గణేష్ ఉత్సవాల ఏర్పాట్లతో పాటు సమాంతరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులు, ఉత్సవాల ఏర్పాట్లలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల వారీగా బాధ్యతలు స్పష్టంగా కేటాయించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లు శాంతిభద్రతలు, భద్రతా దిశగా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారం, రాబోయే పండుగలు, కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్టమైన ముందస్తు కార్యాచరణ రూపొందించాలన్నారు. వినాయక చవితి సందర్భంగా ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసి ట్రాఫిక్ మళ్లింపు పార్కింగ్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విగ్రహాల సంఖ్య, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలు తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్నిసేకరించి జిల్లా స్థాయికి నివేదించాలని తెలిపారు. సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ఎక్కడైనా ముందస్తుగా సమస్యలు లేదా భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటే వాటిని ముందుగానే గుర్తించి తగిన చర్యలుచేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్ని కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ ద్వారా పరిస్థితిలో పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాలు సున్నితమైన ప్రాంతాలుగా ఉన్నప్పటికీ ప్రజల సమైక్య సహకారం, పోలీసు శాఖ మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. సమన్వయం, సంయమనం, సామాజిక బాధ్యతతో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో కలిసి కాలుష్యరహిత వినాయక చవితి పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

**- ప్రారంభించిన నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ**

**-12 వివిధ వయసు కేటగిరీలలో వేరు వేరు గా పోటీలు**

**వేదిక: ఎన్జీవోస్ కాలనీ లో ఉన్న అచీవర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల**




**నంద్యాల ఆగస్టు 22( రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ ఆర్ జి చెస్ అకాడమీ నిర్వహణలో శనివారం నంద్యాల ఎన్జీవోస్ కాలనీలో ఉన్న అచీవర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు జిల్లా స్థాయి చెస్ పోటీలు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం చాలా అవసరమన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి చదువుతోపాటు కళలు,క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న అచీవర్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మానస మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరు వేరుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల లో ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క క్యాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. అచీవర్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ టోర్నమెంట్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వర్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మానస, పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య, చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు వంశీ, టోర్నమెంట్ ఆర్గనైజర్ అరుణ్ కుమార్, ఆర్బిటర్స్ మహేష్ మాలిక్ సురేష్ జయంత్ మాధవి రమ్య మణికుమార్,200 మంది చెస్ క్రీడాకారులు, కోచ్ లు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ప్రధమ రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీలు ప్రారంభం

**-రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహణ**

**. పోటీలు ప్రారంభించిన కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల ఆగస్టు 22( రిపబ్లిక్ న్యూస్) :** ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్. టి చంద్రమౌళి, జిల్లా కార్యదర్శి సర్దార్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధమ రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలను ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, టోర్నమెంట్ స్పాన్సర్ ఎం.బి.టీ. బాబు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో తైక్వాండో క్రీడ ఒలింపిక్స్ లో గుర్తింపు పొందిన క్రీడ అన్నారు. తైక్వాండో క్రీడ విద్యార్థుల శారీరక ధారుడ్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింప చేస్తుందని అన్నారు. ఎం.బి.టీ. బాబు మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ను బాలికలు ఆత్మ రక్షణ కోసం తప్పకుండా నేర్చుకోవాలి అన్నారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మౌళి మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. తైక్వాండో శిక్షణ పలు పాఠశాలలలో కోచ్ లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ తోపాటు ఎం.బి.టీ.బాబు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి,జఖీ వుల్లా, అబ్దుల్లా, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సర్దార్, కోచ్ లు మహబూబ్ భాష, బాలకృష్ణ,షానవాజ్, 200 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com

# ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు రాయికల్ పట్టణ, మండల అభివృద్ధి ఎందుకు కనిపించడం లేదు?

**దావా వసంత సురేష్**

**మూడేళ్లు గడిచినా అసంపూర్తి పనులే.. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలిఅని డిమాండ్ చేసిన మాజీ జగిత్యాల జిల్లా చైర్పర్సన్ దావ వసంత సురేష్**





**రాయికల్ మండలం ఆగస్టు,22( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మండల పర్యటనలు భాగంగా బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

భూపతిపూర్ నుండి వీరాపూర్ 4 కిలోమీటర్ల వరకు 2023లో రోడ్డు పనులకు రెండు కోట్ల 80 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేయగా అప్పుడు ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న సంజయ్ కుమార్ చే శిలాఫలకం వేయబడిందని అన్నారు.

ప్రజలకు రవాణా సౌకర్యం ఇబ్బందులు గురికాకూడదని కెసిఆర్ హయాంలో రెండు కోట్ల 80 లక్షలనిధులు మంజూరు చేశారని అన్నారు.

మూడు సంవత్సరాలు పూర్తయిన కూడా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడి లాగా అన్నట్టే ఉన్నదని అన్నారు.

ప్రజల అభివృద్ధి కోసం పార్టీలు మారిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఈ రోడ్డు అభివృద్ధి పనులు కాదా అని ప్రశ్నించారు...?

గతంలో శంకుస్థాపన చేసిన పనులు ప్రభుత్వాలు మారినా కూడా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆ పనులను కొనసాగించడం ఆ ప్రభుత్వం యొక్క బాధ్యత అని అన్నారు.

ఇది పార్టీల ప్రభుత్వం కాదని ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాస్వామ్య ప్రభుత్వం అని అన్నారు.

ప్రభుత్వంతో అభివృద్ధి పనుల కోసం చేరి రేవంత్ రెడ్డి తో ఉన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి రాయికల్ పట్టణం మరియు మండలం మీ అభివృద్ధి జాబితాలు లేదా....? అని ప్రశ్నించారు

నిన్న జగిత్యాల పర్యటనకు విచ్చేసిన రోడ్డు భవనాల మరియు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనుల అభివృద్ధి చేయాలన్న కనీస జ్ఞానం కూడా లేదా అని అన్నారు.

రాయికల్ పట్టణంలో దాదాపుగా 60 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అసంపూర్ణంగా ఉండి నిరుపయోగంగా ఉంటే అవి ఎందుకు ఎమ్మెల్యే కి కనబడడం లేదు అని అన్నారు.

60 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి దాదాపు పది సంవత్సరాలు అయిందని, ఎందుకు పనులు పూర్తిగా చేయలేకపోతున్నారని అన్నారు.

మీ కాంట్రాక్ట్ పనులు, కమిషన్ల కోసం కాకుండా ఇతర కాంట్రాక్టర్ల బిల్లులు కూడా ఇప్పించాలని అన్నారు.

మైతాపూర్ గ్రామశీలో లెవెల్ బ్రిడ్జి కి కూడా బి ఆర్ ఎస్ హయంలో దాదాపు కోటి రూపాయలు వెచ్చించడం జరిగిందని, ఆ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయని అన్నారు.

రాయికల్ టు రామోజీపేట బ్రిడ్జి పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయని అన్నారు.

మూటపల్లి నుండి కొత్తపేట బ్రిడ్జి 50 లక్షల కేటాయించడం జరిగింది ఆ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయని,మోర పెల్లి నుండి సింగర్ రావు పేట లో లెవెల్ బ్రిడ్జి కి కేసీఆర్ 50 లక్షల కేటాయించడం జరిగిందని ఈ పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ఎమ్మెల్యే ని ప్రశ్నించారు.

అభివృద్ధి అని పార్టీ మారిన ఎమ్మెల్యే కి రాయికల్ ప్రజలు అంటే ఎందుకు అంత అక్కసు అని అన్నారు.

మీ అభివృద్ధి కోసమా లేదా ప్రజల అభివృద్ధి కోసం పార్టీ మారారా అని ప్రశ్నించారు

బి ఆర్ ఎస్ హయంలో మంజూరు చేయబడ్డ 15 కోట్ల రూపాయలు రాయికల్ మున్సిపల్ పట్టణంలో ఉండగా ఆ పనులు ఎందుకు చేయించడం లేదని అన్నారు.

రెవెన్యూ మినిస్టర్ గా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీరు రెవెన్యూ నింపుకోవడం కాదు ప్రజల రెవెన్యూ పెంచాలని అన్నారు. రేవంత్ రెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారి భూదందాల కోసమే 22 నిషేధిత జాబితాలో పేద ప్రజల భూములు చేర్చరాని అన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి పేదలకు పెంచాలి అనే నినాదాన్ని కేసీఆర్ అమలు చేస్తే మీరు దాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించాలని అన్నారు.

జగిత్యాల పట్టణంలో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా 4500 డబ్బులు బెడ్ రూమ్ లు ఇచ్చిన ఘనత కేసిఆర్ కి చెందుతుందని అన్నారు.

కెసిఆర్ మార్క్ చెడిపేయాలని ఆలోచన తప్ప వారు చేసింది ఏమి లేదని అక్కడికి వచ్చి ప్రజలను ఆందోళన గురి చేశారు అని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు అంటున్నారు అని అన్నారు.

కొత్తగా ఏర్పడిన రాయికల్ మున్సిపాలిటీ మరియు అతి పెద్ద రాయికల్ మండలం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే ఎందుకు చెప్పలేదు అని అన్నారు.

ప్రజలకు అవసరమయ్యే ఆర్డీవో కార్యాలయాన్ని పట్టణంలో శంకుస్థాపన చేయక ఎమ్మెల్యే గారి ఇంటిదగ్గర ఎందుకు చేశారని అన్నారు.

సారంగాపూర్ మండలంలోని బట్టపల్లి పోతారంలో సాగు నీరు తాగునీరుగ్గాని చాలా ఇబ్బందులకు గురవుతుందని ఇవేమీ ఎమ్మెల్యే కి కనబడడం లేదా అని అన్నారు.

అసంపూర్తిగా ఉన్న పనులన్నీ పూర్తి చేసినప్పుడే అభివృద్ధి కోసం మారిన అంటున్న ఎమ్మెల్యే ని ప్రజలు నమ్ముతారని అన్నారు.కెసిఆర్ గారి హయాంలో చేసిన పనులే తప్ప ఈ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క పనిచేయలేదు అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పట్టణ అధ్యక్షుడు బర్కాం మల్లేష్ ఏలిగేటి అనిల్ మాజీ ఏఎంసీ చైర్మన్ మరంపెల్లి రాణి సాయి కుమార్ కౌన్సిలర్ రాకేష్ నాయక్ నాయకులు రామతి రావు గంగారెడ్డి రాంప్రసాద్ మైపాల్ తదితరులు ఉన్నారు

# చౌడేపల్లిలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్**

మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని చౌడేపల్లి మండల కేంద్రంలో అభిమానులు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక శ్రీ అభీష్ట మృత్యుంజయేశ్వర స్వామి ఆలయం మరియు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో చిరంజీవి పేరిట అర్చకులు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపించారు. చిరంజీవి సుదీర్ఘకాలం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ స్వామివార్లకు ప్రార్థనలు చేశారు.అనంతరం చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మోనా ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్న అంతర్రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. సమాజసేవే పరమావధిగా తమ అభిమాన కథానాయకుడి పుట్టినరోజున ఈ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వైద్యాధికారి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు మురళి, లీలా కుమార్, జావిద్, నరేష్, కాలేశా, సైపుల్ల తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హుసేనాపురం పాలకొలను చింతలపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎంపీడీవో





**ఓర్వకల్ ప్రతినిధి, ఆగస్టు 22, (రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం హుసేనాపురం , పాలకొలను, చింతలపల్లి, గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించడం జరిగినది, గ్రామపంచాయతీ మరియు జడ్పిటిసి ఎంపిటిసి ఎలక్షన్స్ కు సంబంధించి పోలింగ్ కేంద్రాలను సందర్శించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డిప్యూటీ ఎంపీడీవో మూడు పంచాయతీలకు సంబంధించినటువంటి పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సందర్శించారుద

# వైభవంగా శ్రావణమాస రెండవ శనివారం పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్**



శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ విల్లివిరిసింది. పవిత్రమైన శ్రావణ మాసంలో రెండవ శనివారం అత్యంత ప్రాశస్త్యమైన రోజు కావడంతో, శ్రీ స్వామి వారి దివ్య దర్శనం కోసం భక్తులు ఆలయానికి చేరుకున్నారు ఆలయ ప్రధానార్చకులు వశిష్టాచార్యుల పర్యవేక్షణలో వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం సర్వభూషణాంబరధారిగా దివ్యాలంకరణ గావించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి వారి దివ్య దర్శనం భక్తులకు నేత్రపర్వంగా నిలిచింది.

# ఓబుల్ రెడ్డి పార్తివదేహానికి నివాళులర్పించిన ద్వజారెడ్డి.





**రైల్వే కోడూరు ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు మండలం ఉల్లగట్టు పాడు గ్రామం కాపుపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి ఓబులరెడ్డి అకాల మృతి చెందినట్లు తెలుసుకొని ఆయన స్వగృహానికి వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, రైల్వే కోడూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు రామిరెడ్డి ద్వజారెడ్డి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు అధైర్య పడవద్దు అని పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఎంపిటిసి మహేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ బై శంకర్ రెడ్డి,రెడ్డయ్య రెడ్డి, కుంచం హరి, సంటి నాగరాజు, మరియు పార్టీ నాయకులు రామిరెడ్డి ఓబుల్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు.

# జగిత్యాల జిల్లా ఈ నెల 24 న ఆటోడ్రైవర్ల బంద్ కు సంపూర్ణ మద్దతు



**రాయికల్ మండలం ఆగస్టు 22( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఈనెల 24 నుంచి తలపెట్టిన బంద్ కు అన్ని పార్టీల మద్దతు కోరుచున్నాము పాత బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది , ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలు ఇచ్చి లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ప్రారంభించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ను ఇప్పుడున్న ఆటోడ్రైవర్లతో నడిపించాలని డిమాండ్ చేశారు. ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని.. ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా ప్రభుత్వమే యాప్ తీసుకురావాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు.

# నల్లమల సాగర్ కు కృష్ణా జలాలు.

**31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం.**

**నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ.**

**-జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.**

**ఉండవల్లి,ఆగస్టు 22 రిపబ్లిక్ న్యూస్.**



వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్- 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింప జేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగాధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు లో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూపుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.